జిల్లాలో 30 యాక్టు అమలు

కామారెడ్డి టౌన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 30 యాక్టు అమలులో ఉందని ఎస్పీ సింధూశర్మ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 30 వరకు ఈ యాక్టు అమలులో ఉంటుందని తెలిపారు. అనుమతి లేకుండా ఎలాంటి సభలు, సమావేశాలు నిర్వహించినా నిబంధనలకు విరుద్ధంగా ర్యాలీలు నిర్వహించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కావున జిల్లా ప్రజలు సహకరించాలని కోరారు.

సర్వేకు సర్వం సిద్ధం!



కామారెడ్డిలో ఇంటింటికీ స్టిక్కర్లు అంటిస్తున్న సిబ్బంది

- 6 నుంచి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే
- జిల్లాలో 535 పంచాయతీలు, 3 మున్సిపాలిటీల్లో కొనసాగనున్న సర్వే
- 56 అంశాలతో సర్వే నిర్వహించనున్న ఎన్యూమరేటర్లు
- ఇప్పటికే ఇంటింటికీ వెళ్లి స్టిక్కర్లు అంటిస్తున్న సిబ్బంది
- మూడు రోజుల్లో ఇంటింటికీ స్టిక్కర్లు అంటించేందుకు కసరత్తు
- సర్వేపై ప్రజల్లో ఒక్కింత ఆందోళన
- ప్రజాపాలన దరఖాస్తుల నమోదులో డాటా ఎంట్రీ ఆపరేటర్ల తప్పిదాలు
- ఇప్పటికీ మున్సిపల్, ఎంపీడీవో కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న ప్రజలు
- ఈ సర్వే పూర్తయ్యే వరకైనా ఉన్నతస్థాయి అధికారులు ప్రత్యేక దృష్టి సారించేనా?

కామారెడ్డి టౌన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే(సామాజిక, ఆర్థిక, రాజకీయ, కుల సర్వే)కు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. సర్వే మార్గదర్శకాలను ఇప్పటికే ప్రభుత్వం విడుదల చేసింది. క్షేత్రస్థాయిలో ఇబ్బందులు రాకుండా చర్యలు చేపట్టింది. ఈ సర్వే పారదర్శకంగా ఉండేలా సర్వే విషయాలను గోప్యంగా ఉంచేలా, ఎలాంటి తప్పులు లేకుండా చేసేలా చర్యలు తీసుకుంటుంది. ఇందులో భాగంగా ఇప్పటికే ఎన్యూమరేటర్లకు శిక్షణను అందిస్తున్నారు. జిల్లాలోని 535 గ్రామ పంచాయతీలు ఉండగా, కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ మున్సిపాలిటీలు ఉన్నాయి. స్థానిక సంస్థల సిబ్బందితో పాటు మెప్మా, ఐకేపీ సిబ్బందిని సర్వేలో భాగంగా చేస్తున్నారు. సర్వే వివరాల సేకరణ అనంతరం డేటా ఎంట్రీ సైతం పక్కాగా చేపట్టనున్నట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. అయితే ప్రజాపాలన దరఖాస్తుల నమోదులో మున్సిపాలిటీ, ఎంపీడీవో కార్యాలయాల పరిధిలో డాటా ఎంట్రీ ఆపరేటర్లు చేసిన తప్పిదాలతో ఇప్పటికీ ప్రజలు ఆయా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. దీంతో ఈ సర్వేపై సైతం ప్రజలు పెదవి విరుస్తున్నారు. అధికారులు చేస్తున్న తప్పిదాలకు తాము ఇబ్బందులు పడాల్సి వస్తుందని పేర్కొంటున్నారు. కాగా శుక్రవారం కామారెడ్డి పట్టణంలోని ఆయా కాలనీల్లో ఇంటింటికీ స్టికర్లను అంటించే కార్యక్రమాన్ని మొదలుపెట్టగా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పరిశీలించారు.

ఇంటింటికీ స్టిక్కర్లు అంటిస్తున్న సిబ్బంది

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను ఈనెల 6 నుంచి ప్రారంభిస్తుండగా ఆయా స్థానిక సంస్థలలోని సిబ్బందితో పాటు మెప్మా, ఐకేపీ సిబ్బంది ఇంటింటికీ స్టిక్కర్లు అంటించే కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ప్రతీ ఇంటిని లిస్టింగ్ చేసుకుని నవంబరు 6 నుంచి సర్వే ప్రారంభించనున్నారు. ఇంటి నెంబర్ ఆధారంగా ఎన్యూమరేటర్లు వారికి కేటాయించిన కుటుంబాల వివరాలను క్రమపద్ధతిలో నమోదు చేస్తారు. ప్రతీ ఇంట్లో నివసించే వారి సంఖ్యను నిర్ధారించడంతో పాటు ప్రతీ కుటుంబానికి సంబంధించిన ప్రాథమిక సమాచారం సేకరించి ఇంటి నెంబర్, ఇంటి యజమాని పేరు తదితర వివరాలు ఫారంలో నమోదు చేస్తారు. ఈనెల 2,3 వరకు ఇంటింటి స్టిక్కర్లు అంటించే కార్యక్రమాన్ని పూర్తి చేయనున్నారు. 4,5 తేదీల్లో ఇంటింటికీ అంటించిన స్టిక్కర్ల వివరాల ఆధారంగా సర్వేకు సంబంధించిన ప్రోఫార్మాలను ముద్రించనున్నారు.

56 అంశాలతో సర్వే

ఎన్యుమరేటర్లు ఇంటింటికీ వెళ్లి 56 అంశాలతో కూడిన వివరాలు సేకరించనున్నారు. యజమాని, కుటుంబ సభ్యులు, కులం, వయస్సు, మాతృభాష, ఆధార్, మొబైల్ నెంబర్, మానసిక స్థితి, వైకల్యం, విద్య, చదువుమానివేస్తే ఏ తరగతి అనేది నమోదు చేస్తారు. ప్రస్తుతం చేస్తున్న పని, ఉద్యోగం, స్వయం ఉపాధి, వ్యాపారం, పారిశ్రామిక వేత్త అయితే వార్షిక టర్నోవర్, వేతన కార్మికులైతే ఏ రంగంలో పని చేస్తున్నారు. సంప్రదాయ కులవృత్తుల వివరాలు సేకరిస్తారు. అనారోగ్యం, వార్షికాదాయం, ఆస్తులు, బ్యాంకు అప్పుల వివరాలు కూడా ఫార్మాట్ ప్రకారం నమోదు చేస్తారు. ఆదాయపు పన్ను చెల్లింపుదారులైతే బ్యాంకు ఖాతా, భూమి ఉంటే ధరణి పాస్‌పుస్తకం నెంబర్, పట్టా భూమి, అసైన్డ్ భూమి, నీటిపారుదల సౌకర్యం, కౌలు భూమి సాగు చేస్తే ఆ వివరాలు సైతం సేకరిస్తారు. ఒకవేళ రిజర్వేషన్‌తో విద్య, ఉద్యోగ తదితర ప్రయోజనాలు పొందితే వివరాలు, ఐదేళ్లుగా లబ్ధిపొందిన పథకాల పేర్లు, ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్లు పొందారా.. కుటుంబ సభ్యుల రాజకీయ నేపథ్యం గురించి కూడా ఆరా తీయనున్నారు. కుటుంబంలోని ఎవరైన ఇతర దేశాలు, రాష్ట్రాలకు వలస వెళితే వివరాలు, వలసకు గల కారణాలు సేకరిస్తారు. కుటుంబానికి సంబంధించిన అప్పులు, పశుసంపద, స్థిరాస్తి వివరాలు, రేషన్‌కార్డు నెంబర్, నివాస గృహ విస్తీర్ణం, తాగునీటి వసతి, ఇంటి విస్తీర్ణం, ఇంటి గదుల సంఖ్య తదితర 56 అంశాలపై వివరాలు సేకరిస్తారు.

మార్గదర్శకాలపై శిక్షణ

సామాజిక, ఆర్థిక సర్వే, రాజకీయ, కుల సర్వే మార్గదర్శకాలపై మండలాల్లో ప్రత్యేకాధికారులు, ఎంపీడీవోలు, సూపర్‌వైజర్లకు శిక్షణ సైతం ఇస్తున్నారు. నవంబరు 6 నుంచి 18 వరకు నిర్వహించనున్న సమగ్ర ఇంటింటి కుటుంబసర్వేపై అధికారులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండా లని ఇప్పటికే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు ఆయా శాఖల మంత్రులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఎన్యూమరేటర్లు ప్రక్రియలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటా నేందుకు సిద్ధం అవుతున్నారు. సర్వే సమయంలో ఎన్యూమరేటర్లు ప్రజలతో గౌరవంగా, హుందాగా వ్యవహరించాలని సూచిస్తున్నారు. ఈ సర్వే ఉద్దేశ్యంపై ప్రజలకి అవగాహన కల్పించాలని ఇంటింటికీ వెళ్తున్న సిబ్బందికి తెలుపుతున్నారు.

సర్వేపై ప్రజల్లో ఒకింత ఆందోళన

రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సర్వేపై ప్రజల్లో ఒక్కింత ఆందోళన మొదలైంది. గత ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే చేపట్టినప్పుడు, ప్రస్తుత ప్రభుత్వం ప్రజాపాలన దరఖాస్తులు తీసుకున్నప్పుడు ప్రజల నుంచి సేకరించిన వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే సమయంలో పెద్ద ఎత్తున తప్పిదాలు చేశారని దీంతో ఇప్పటికీ తమకు అనేక ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరం కావాల్సి వస్తుందని ప్రజలు పేర్కొంటున్నారు. శుక్రవారం ఇంటింటికీ స్టిక్కర్లు అంటిస్తున్న సిబ్బందికి మళ్లీ ఏం సర్వే చేస్తున్నారు. ఇప్పటికే ప్రజాపాలన పేరుతో దరఖాస్తులు తీసుకుని అనుభవంలేని వారితో డాటా ఎంట్రీలు చేయించడంతో పాటు వివరాల నమోదులో ఇష్టారీతిన వ్యవహరించారని దీంతో తాము ఉచిత విద్యుత్‌తో పాటు గ్యాస్ సబ్సిడీకి దూరమయ్యామని విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికీ మున్సిపల్‌తో పాటు ఆయా ఎంపీడీవో కార్యాలయాలకు చెప్పులు

(మిగతా 8వ పేజీలో)



ఘనంగా దీపావళి వేడుకలు



టపాకాయలు కాలుస్తున్న దృశ్యం

- రకరకాల టపాసులను పేల్చిన చిన్నారులు, పెద్దలు
- వ్యాపార సముదాయాలను విద్యుత్ దీపాలతో అలంకరించిన వైనం
- దుకాణాల్లో లక్ష్మీదేవి పూజల వేడుకలు
- పేకాటస్థావరాలపై దాడి
- రూ.7,79,740 స్వాధీనం

కామారెడ్డి టౌన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని ఆయా మండలాల్లో గురువారం ఘనంగా దీపావళి వేడుకలను జరుపుకున్నారు. తెల్లవారుజాము నుంచే ప్రతీ ఇంట్లో లేచి పిల్లాపాపలతో తలంటు స్నానాలు చేసి కొత్త బట్టలు ధరించి హారతులు తీసుకున్నారు. తియ్యటి పదార్థాలను సేమియాలు, పేనీలు సేవించి కొత్త అల్లుళ్లకు కూతుళ్లకు కొత్త బట్టలు పెట్టి దీపావళి వేడుకలను జరుపుకున్నారు. సాయంత్రం లక్ష్మీదేవి అమ్మ వారిని రంగు రంగుల పువ్వులతో, విద్యుత్ దీపాలంకరణతో అందంగా అలంకరించారు. వేదపండితుల మంత్రోచ్చరణలతో లక్ష్మీ పూజల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. వ్యాపారులు దుకాణాలను లక్ష్మీ పూజల కోసం ప్రత్యేక విద్యుత్ దీపాల అలంకరణతో పాటు అరటి, కొబ్బరి, మామిడి ఆకులు, బంతి పూలతో అందంగా అలంకరించారు. జిల్లా కేంద్రంలోని ప్రియా డీలాక్స్ రోడ్డు, నిజాంసాగర్ రోడ్డు, కమాన్ రోడ్డు, పెద్ద బజారు, స్టేషన్ రోడ్డు, అడ్లూర్ రోడ్డు, సిరిసిల్లా రోడ్డు, జేపీఎన్ రోడ్డు, తిలక్‌రోడ్డు, సుభాష్ రోడ్డు, గాంధీగంజ్‌లోని కిరాణ, బట్టల, ఆభరణాలు, గంజ్ వ్యాపారులు, చిట్‌ఫండ్ వ్యాపారులు, ఆయిల్ మిల్స్, సామిల్స్ హోటల్స్ లలో, బోర్‌వెల్స్ రియల్ ఏస్టేట్ కార్యాలయాల్లో లక్ష్మీపూజ కార్యక్రమాలు కుటుంబ సమేతంగా, బంధు మిత్రులతో కలిసి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

పేకాట స్థావరాలపై దాడి : రూ.7,79,740 స్వాధీనం



దుకాణంలో లక్ష్మీపూజ నిర్వహిస్తున్న వ్యాపారులు

జిల్లాలోని వివిధ పోలీసుస్టేషన్ల పరిధిలో పేకాట ఆడుతున్న వారిని పోలీసులు దాడులు చేసి పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ సింధూశర్మ మాట్లాడుతూ జిల్లాలోని నిజాంసాగర్ పోలీసు స్టేషన్ పరిధిలోని అటవీ ప్రాంతంలో పేకాట ఆడుతున్న 9 మందిని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. పెద్దకొడపగల్ పోలీసుస్టేషన్ పరిధిలోని అంజని గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఆరుగురిని పట్టుకున్నట్లు తెలిపారు. కామారెడ్డి పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలో జయ ఆసుపత్రి వెనుక పేకాట ఆడుతున్న 4 గురిని పట్టుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా దర్శన్ టాకీస్ ఎదురుగా ఉన్న గల్లీలో పేకాట ఆడుతున్న నలుగురిని పట్టుకున్నట్లు తెలిపారు. దేవునిపల్లి పోలీసు స్టేషన్ పరిధిలోని గర్గుల్ గ్రామ శివారులో పేకాట ఆడుతున్న నలుగురిని పట్టుకున్నట్లు తెలిపారు. మొత్తం 42 కేసులలో 309 మందిపై కేసులు నమోదు చేయడంతో పాటు 146 సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గత మూడు రోజులలో రూ. 7లక్షల 79 వేల 740లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

కేసులను.. త్వరితగతిన పూర్తి చేయాలి!



ఏఎస్ఐ సుభాషిణికి ప్రశంసాపత్రం అందిస్తున్న ఎస్పీ

ఎస్పీ సింధూశర్మ

కామారెడ్డి టౌన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కేసులలో నాణ్యమైన విచారణ చేసి త్వరితగతిన పూర్తి చేయాలని ఎస్పీ సింధూశర్మ అన్నారు. శుక్రవారం ఎస్పీ కార్యాలయంలో నెలవారి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెండింగ్ ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. సైబర్ క్రైమ్ నేరస్తులను పీటీ వారెంట్ ద్వారా కోర్టులో ప్రవేశపెట్టి సైబర్ బాధితులకు బాసటగా నిలవాలని సూచించారు. అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులు పరిమిత లిమిట్‌లో ఉండాలని, గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులలో ఇన్వెస్టిగేషన్ చేసేటప్పుడు ఏ విధంగా ఇన్వెస్టిగేషన్ చేయాలని తెలిపారు. ప్రతీ కేసులో నాణ్యమైన ఇన్వెస్టిగేషన్ త్వరితగతిన పూర్తిచేసి బాధితులకు అండగా నిలవాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక దృష్టి సారించి ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను ఆక్సిడెంట్ స్పాట్ ఏరియాలుగా గుర్తించి, సైన్‌బోర్డులను ఏర్పాటు చేయించాలని సూచించారు. తరచూ వెహికల్ చెకింగ్ నిర్వహిస్తు డ్రంకెన్‌డ్రైవ్ టెస్ట్ నిర్వహించాలని అన్నారు. ఫేక్ నెంబర్ ప్లేట్స్, నెంబర్ ప్లేట్స్ మార్పుపై ప్రత్యేక దృష్టి సారించి కఠిన చర్యలు తీసుకోవాలని వాహనదారులతో మర్యాదగా మాట్లాడుతూ వాహనాన్ని క్షుణంగా తనిఖీ చేయాలని అన్నారు. నేర నియంత్రణతో పాటు జరిగిన నేరాలను ఛేదించడంలో ఉపయోగపడే సీసీ కెమెరాల ప్రాధాన్యతను ప్రజలకు వివరిస్తూ స్వచ్ఛందంగా వారి గ్రామాల్లో, ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునే విధంగా ప్రోత్సహించాలన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా విజిబుల్ పోలీసింగ్ ద్వారా ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రస్తుతం జరుగుతున్న వివిధ రకాల ఆన్‌లైన్, మోసాల గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో రెండు వారాల స్టేషన్ రైటర్ శిక్షణ పూర్తి చేసుకున్న 18 మంది మహిళ అధికారులకు ప్రశంసా పత్రాలను అందజేశామన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ నరసింహారెడ్డి, డీఎస్పీలు నాగేశ్వర్‌రావు, సత్యనారాయణ, ఎస్‌బీ ఎస్‌స్పెక్టర్ జార్జ్, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ మురళి తదితరులు పాల్గొన్నారు.

లింగంపేటలో అకాల వర్షం

- అకాల వర్షాలకు తడిసిన ధాన్యం
- కొనుగోళ్లు లేక కేంద్రాల్లోనే రైతులు
- ఆందోళనలో అన్నదాతలు





పర్మల్లలో వర్షం నీటిలో కొట్టుకుపోతున్న ధాన్యాన్ని కాపాడుకుంటున్న రైతులు


లింగంపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శెట్పల్లి, అయ్యపల్లి, పర్మల్ల గ్రామాల్లో శుక్రవారం కురిసిన అకాల వర్షానికి కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దయింది. దీంతో ధాన్యాన్ని తడవకుండా కాపాడుకునేందుకు రైతులు ఎంతో తపన పడుతున్నారు. రోడ్డుపై ఆరబోసిన వర్షం కొట్టుకుపోవడంతో రైతులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. చేతికి వచ్చిన పంట తమ కళ్లముందే నేలపాలు అవుతుంటే కాపాడుకునే అవకాశం లేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ఉంటే ఇప్పటికే అనేక మంది రైతుల ధాన్యం రైస్‌మిల్లులకు చేరేదని ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు చేయకపోవడంతోనే రైతులకు ఇబ్బందులు వస్తున్నాయన్నారు. ప్రైవేటులో దళారులు క్వింటాలుకు రూ.2100కు కొనుగోలు చేస్తున్నారని తరుగు పేరిట మరింత కోత కోస్తున్నారని అటు ప్రైవేటుకు అమ్ముకోలేక, ప్రభుత్వం కొనుగోలు చేయక రైతులకు నష్టం వస్తుందని వారు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం వెంటనే కొనుగోళ్లు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

సీసీఐ కొనుగోళ్లపైనే పత్తి రైతుల ఆశలు!



- ముందు నుంచి కొనుగోలు చేస్తేనే ధరల్లో నిలకడ
- లేదంటే పత్తి దళారుల పాలయ్యే అవకాశం
- మద్నూర్‌లోని 8 జిన్నింగ్ మిల్లుల్లో కొనుగోలు కేంద్రాలు సిద్ధం చేసిన సీసీఐ

7



సర్వేలో ఎటువంటి పొరపాట్లు జరగొద్దు

● అడిషనల్ కలెక్టర్ అంకిత్



అబ్బాపూర్(ఎం)లో అధికారులతో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్

నవీపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 6నుంచి ప్రారంభం కానున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా పకడ్బందిగా నిర్వహించాలని అడిషనల్ కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. శుక్రవారం మండలంలోని అబ్బాపూర్(ఎం)లో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు సంబంధించి ఎన్యూమరేటర్లకు కేటాయించిన బ్లాక్‌లను పరిశీలించారు. ప్రతీ కుటుంబాన్ని సర్వేలో నమోదు చేయాలని, సర్వే చేపట్టే ప్రతీ కుటుంబానికి చెందిన ఇంటిపై స్టిక్కర్ అతికించి వివరాలు నమోదు చేయాలని సూచించారు. సర్వే అనంతరం ఎప్పటికప్పుడు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నాగనాథ్, ఎంపీవో రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి సునీత, తదితరులున్నారు.

కార్మికుల శ్రేయస్సే ఏఐటీయూసీ లక్ష్యం

కోటగిరి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కార్మికుల శ్రేయస్సే ఏఐటీయూసీ లక్ష్యమని ఏఐటీయూసీ జిల్లా నాయకులు విఠల్ గౌడ్ పేర్కొన్నారు. కోటగిరి మండల కేంద్రంలో గురువారం ఏఐటీయూసీ 105వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరించి బాణాసంచా కాల్చి స్వీట్లను పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి సంపూర్ణ స్వాతంత్ర కావాలని కార్మికుల పని గంటలు, పని భద్రత, కనీస వేతనాలు అమలు చేయాలని ఏఐటీయూసీ సంఘాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 44రకాల కార్మిక చట్టాలతో పాటు భవన నిర్మాణ వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయించిన ఘనత ఏఐటీయూసీకే దక్కుతుందన్నారు. కార్మికుల ఐక్యతతో పోరాడి సాధించుకున్న 44రకాల చట్టాల్లో 29రకాల చట్టాలను రద్దు చేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు అన్యాయం చేస్తున్నాయని దుయ్యబట్టారు. కార్మిక చట్టాల పునరుద్ధరణకు కార్మికులు సంఘటితం కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు గంగాధర్, నాగిరెడ్డి, దత్తు, శంకర్, మధు, గజేందర్, రాములు, రాజు, కిష్టయ్య, అన్వర్, జావీద్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఆలూర్ విద్యార్థిని ఎంపిక

ఆర్మూర్‌రూరల్, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): ఆలూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని వై.కీర్తన రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయుడు నరేందర్, పీడీ రాజేష్‌లు తెలిపారు. ఇటీవల ఉమ్మడి జిల్లా సబ్‌జూనియర్ బాలికల ఎంపిక పోటీలు కల్లెడి ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించారు. ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబర్చిన కీర్తన రాష్ట్రస్థాయికి ఎంపికైందన్నారు. ఈ నెల 2వ తేదీ నుంచి ఆసిఫాబాద్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి హ్యాండ్ పోటీల్లో పాల్గొంటుందన్నారు.

రగ్బీ పోటీలకు ఎంపిక

ఆర్మూర్‌రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణంలోని శ్రీ భాషిత హైస్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ఎంపికైనట్టు పాఠశాల కరస్పాండెంట్ పోలపల్లి సుందర్ తెలిపారు. విద్యార్థులు సాత్విక్, హేమంత్, లావణ్య, శ్రావికలు ఇటీవల కామారెడ్డిలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ఎంపికయ్యారన్నారు. రాష్ట్రస్థాయి ఎంపికైన పోటీలకు కరస్పాండెంట్ పోలపల్లి సుందర్ అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా జట్టును ప్రథమ స్థానంలో నిలపాలని సూచించారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినికి అభినందన

ఆర్మూర్‌టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని, ఎన్ఎస్ఎస్ వాలీంటర్ జి.శ్రీహర్షిణిని శుక్రవారం ప్రిన్సిపాల్ డాక్టర్ వై.వేణుప్రసాద్ అభినందించారు. జాతీయ సమాఖ్య శిబిరంలో హర్యానలోని ఇందిరాగాంధీ యూనివర్సిటీలో గతనెల 21నుంచి 27వ తేదీ వరకు జరిగిన నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంప్‌లో విద్యార్థులు పాల్గొన్నారని, సూజాన్ డ్యాన్స్ పోటీల్లో శ్రీహర్షిణి మొదటి బహుమతి సాధించడం పట్ల పలు అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎం.సునీత, డాక్టర్ వజీరభాను, అధ్యాపకులు యాదగిరి, డాక్టర్ లింగన్న, శ్యామ్‌కుమార్, వి.రాజ్‌కుమార్, అబ్దుల్‌రహమన్ పాల్గొన్నారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

నవీపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): నవీపేట రైల్వే స్టేషన్ సమీపంలో గురువారం సాయంత్రం రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. సుమారు 55 నుంచి 60ఏళ్ల వయసు గల గుర్తు తెలియని వ్యక్తి జానకంపేట మార్గం వైపు ఉన్న పట్టాలు దాటుతుండగా గూడ్స్ రైలు ఢీ కొట్టడంతో మృతదేహం నుజ్జునుజ్జుగా అయిందని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహన్ని పోసుమాస్టం కోసం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు. సంఘటన స్థలంలో మృతుడికి సంబంధించి ఎటువంటి ఆధారాలు లభించలేదన్నారు.

కాకతీయ కాలువలో ఒకరు గల్లంతు

మెండోర, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన కొండూరు చిన్న గంగాధర్ కాకతీ య కాలువలో ప్రమాదవశాత్తు గల్లంతైనట్టు స్థానికులు తెలిపారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గంగాధర్ కాలువలో కాళ్లు కడుక్కోవడానికి వెళ్లి ప్రమాదవ శాత్తు పడి గల్లంతయ్యాడని అంద రు చూస్తుండగానే నీటి ప్రవాహనికి కొట్టుకుపోయాడని తెలిపారు. గ ల్లంతయైన విషయాన్ని స్థానికులు ప్రాజెక్టు అధికారులకు సమాచారం అందించగానే కాకతీయ కాలువకు నీటి ప్రవాహన్ని నిలిపివేశారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

బోధన్‌రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకొని ఆత్మహత్యకు ప్రయత్నించిన ఘటన గురువారం చోటు చేసుకుంది. బోధన్ మండలంలో బెల్లాల్ గ్రామానికి చెందిన రాజు అనే వ్యక్తి పోలీస్ స్టేషన్ ఎదుట పెట్రోల్ పోసుకున్నాడు. పోలీసులు వెంటనే అతనిని అదుపులోకి తీసుకుని నిప్పు పెట్టుకోకుండా స్టేషన్ లోపలికి తరలించి కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా పట్టణ సీఐ వెంకట నారాయణ మాట్లాడుతూ రాజు, అతని భార్య మధ్య వివాదం నెలకొందని, గురువారం భార్యభర్తల మధ్య వివాదం పోలీస్ స్టేషన్‌కు చేరిందన్నారు. రాజు భార్య సావిత్రి మధ్య గొడవలు తలెత్తడంతో ఆమె బంధువు వద్ద ఒకరోజు ఉంది. ఈ విషయం తెలిసిన రాజు ఆ బంధువుతో గొడవకు దిగాడు. రోడ్డుపై గొడవ వద్దని మధ్యవర్తిగా వచ్చిన వ్యక్తిపై రాజు దాడికి పాల్పడ్డారన్నారు. అందరు పోలీస్ స్టేషన్‌కు రావడంతో రాజు ఆగ్రహంతో పెట్రోల్ తెచ్చుకుని తలపై పోసుకోవడంతో పాటు అతని భార్యపై సైతం పెట్రోల్ పోశాడు. ఆత్మహత్య యత్నానికి ప్రయత్నించిన ఘటనలో రాజును అదుపులోకి తీసుకుని అతనిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

కోటగిరి,నవంబరు1(ఆంధ్రజ్యోతి): కోటగిరి మండలంలోని ఎత్తొండ క్యాంప్‌లో శుక్రవారం లక్ష్మి(43)అనే వివాహిత విద్యుదాఘాతంతో మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. మృతురాలు ఓ ఇంట్లో బట్టలు ఉతికి ఆరవేస్తుండగా జీవో వైర్‌కు విద్యుత్ సరఫరా కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఈ విషయంపై కోటగిరి ఎస్సై సందీప్‌ను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై తెలిపారు.

మొరం టిప్పర్ల పట్టివేత

కోటగిరి,నవంబరు1(ఆంధ్రజ్యోతి): కోటగిరి మండలంలోని రోజాపూర్ శివారులో అనుమతి లేకుండా అక్రమంగా తరలిస్తున్న మొరం టిప్పర్లను తహసీల్దార్ గంగాధర్ పట్టుకున్నారు. అనుమతి లేకుండా మొరం తవ్వకాలు జరుపుతున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసి రెండు టిప్పర్లను, జేసీబీని సీజ్ చేసినట్లు తహసీల్దార్ గంగాధర్ తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ తిరిగి అప్పగించిన ఎస్సై

మోర్తాడ్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మోర్తాడ్ గ్రామానికి చెందిన అబ్దుల్ జాకీర్ తన సెల్‌ఫోన్‌ను మూడు నెలల క్రితం పోగొట్టుకున్నాడని, బాధితుని ఫిర్యాదు మేరకు పీఆర్ పోర్టల్ నందు నమోదు చేయగా పోర్టల్ ఆధారంగా సెల్ ఫోన్‌ను పట్టుకొని బాధితునికి అప్పగించినట్టు ఎస్సై విక్రం తెలిపారు.

ఇసుక అక్రమ రవాణాకు అడ్డు కట్టేది?

● చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్న అధికారులు



ఇసుకను డంప్ చేసి అధిక రేట్లకు విక్రయిస్తున్న ఇసుక బకాసురులు

మెండోర, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): అడ్డూ అదుపు లేకుండా అక్రమ ఇసుక రవాణా చేస్తున్నా అడ్డుకొని సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. మండలంలో ఇసుక రవాణా అక్రమ జోరుగా కొనసాగుతున్నప్పటికీ ప్రభుత్వ అధికారులు పట్టించుకోవడం లేదని ఆ ప్రాంత ప్రజలు ఆరోపిస్తున్నారు. అర్ధరాత్రి ఒంటి గంట నుంచి ఇసుక ట్రాక్టర్‌లు వేకువజామున 5గంటల వరకు గుట్టు చప్పుడు కాకుండా సమయపాలన అనుమతులు లేకుండా అక్రమ ఇసుక దందాను యాథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. ఇసుకకు సంబంధించిన శాఖలలు ఎలాంటి చర్యలు తీసుకోక పోవడంతో ఇసుక బకాసురులు ఇదే అనువుగా భావించి తాము అధికారులకు నెలనెల రుసుము చెల్లిస్తున్నామని మార్కెట్‌లో బాహటంగానే చెబుతూ తమ ఇసుక వ్యాపారాన్ని జోరుగా కొనసాగిస్తున్నారు. కట్టడి చేయాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్న సంఘటనలు మండల వ్యాప్తంగా నెలకొన్నాయి. ఈ ప్రాంతం నుంచి సుమారు రోజుకు పదుల సంఖ్యలో టిప్పర్‌లు, ట్రాక్టర్‌లు, మేయిన్ రోడ్డు గుండా జిల్లా సరి హద్దు దాటి పక్క జిల్లా నిర్మల్, జగిత్యాల్ వెళ్తు న్నప్పటికీ అధికారులు పట్టి పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. ఈ ప్రాంత ఇసుకకు అధిక రేటు ఉం టుందని ఇసుక బకాసురులు ఇతర ప్రాంతాలకు తీసుకువెళ్లి అధిక రేట్లకు విక్రయిస్తూ ఈ ప్రాంత సహజ సంపదను కొల్లగొట్టి అధిక లాభాలు గడిస్తున్నారు. ఇసుక తరలిస్తున్న ప్రాంతాన్ని పరీక్షించి ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సంబంధిత అధికారులు ఆదేశించినప్పటికీ ఇసుక బకాసురులు పట్టించు కోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. నెలలో ఏదో తూతూ మంత్రంగా ఒకటికి రెండు ట్రాక్టర్‌లను సీజ్ చేయడం తప్ప ఇసుకను అరికట్టేందుకు కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేయడంలో ప్రభుత్వ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని మండల ప్రజలు, పలు పార్టీల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. ఈ ప్రాంత ప్రజలకు గృహ అవసరాలకు ఉపయోగించుకోవాల్సిన ఇసుకను బకాసురులు అక్రమంగా ఇతర ప్రాంతాలకు తరలించడం వల్ల తమ ప్రాంతాల్లోని ఇసుక పూర్తిగా లేకుండా పోతుందని ఈ ప్రాంత ప్రజలు ఆరోపిస్తున్నారు. తాము ఇల్లు నిర్మించుకోవాలంటే ఇతర ప్రాంతాల నుంచి కొనుక్కునే పరిస్థి త్వరలో రానుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తునారు. ఏలాంటి పర్మిషన్ లేకుండా ఇసుక జోరుగా కొనసాగు తున్నప్పటికీ ప్రభుత్వం ఏం చేస్తున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా కలెక్టర్, యంత్రాంగం స్పందించి ఇసుకను అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా దీపావళి సంబరాలు



లక్ష్మీదేవి పూజలు నిర్వహిస్తున్న టీజీఎస్‌డీసీ చైర్మన్ అన్వేష్‌రెడ్డి



బోధన్‌లో బొమ్మల కొలువు



కుటుంబసభ్యులతో ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

బోధన్‌రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): బోధన్ డివిజన్‌లో ప్రజలు ఘనంగా దీపావళి పండుగను జరుపుకున్నారు. బోధన్ పట్టణంతో పాటు సాలూర, బోధన్ మండలాల్లో ప్రజలు దీపావళి పండుగ జరుపుకున్నారు. ప్రజలు దుకాణ సముదాయాల్లో లక్ష్మీపూజలు నిర్వహించి, బాణాసంచాలు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. దీపావళి పండుగ సందర్భంగా శివాలయం, మారుతీమందిరం, తదితర ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కోటగిరి: కోటగిరి ఉమ్మడి మండలంలో గురువారం దీపావళి సంబరాలను మండల ప్రజలు ఘనంగా నిర్వహించారు. దీపావళి పండుగను పురస్కరించుకుని ఇల్లు, వ్యాపార సంస్థల్లో లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బాణాసంచాలు కాలుస్తూ దీపావళి సంబరాలను ఘనంగా నిర్వహించారు.

రెంజల్: రెంజల్ మండలంలోని అన్ని గ్రామాలలో గురు, శుక్రవారాల్లో దీపావళి పండుగను ప్రజలు ఘనంగా నిర్వహించారు. లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వీట్లు పంచుకుని టపాకాయలు కాల్చి దీపావళి సంబరాలు నిర్వహించారు.

నవీపేట: మండలంలోని పలు గ్రామాలలో గురువారం దీపావళి పండుగను ఘనంగా నిర్వహించారు. గృహలతో పాటు వర్తక, వాణిజ్య కేంద్రాలను మామిడి తోరణాలు, అరటి బోదేలు, రంగురంగుల పూలతో అలంకరించారు. లక్ష్మీదేవికి పూజలు నిర్వహించి బాణాసంచాలు కాల్చారు.

ఆర్మూర్‌లో..

పెర్కిట్: దీపావళి పర్వదినం పురస్కరించుకొని ఆర్మూర్ పట్టణంలో ప్రజలందరు దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహిం చారు. గురువారం ఉదయం ఇళ్ళలో పూలతో, దీపాలతో అలందంగా అలంకరించుకున్నారు. ఇళ్ళలో, వ్యాపార సముదాయాల్లో కుటుంబసమేతంగా కలిసి లక్ష్మీపూజలు నిర్వహించారు. టపాకాయలు కాల్చారు.

దుబాయిలో దీపావళి సంబరాలు

ఆర్మూర్‌టౌన్: పట్టణానికి చెందిన పలువురు దుబాయిలో దీపావళి సంబరా లను జరుపుకున్నారు. ఇటీవల దుబాయి పర్యటనలో వెళ్లిన కౌన్సిలర్ గంగా మోహన్ చక్రు కుటుంబసభ్యులు, అలాగే జీవనో పాధికి దుబాయిలో నివాస ముంటున్న ఆర్మూర్ పట్టణ వాసులు లక్ష్మీదేవి చిత్ర పటానికి పూజలు నిర్వ హించి టపాకాయలు కాల్చారు.

దీపావళి సంబరాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కుటుంబసభ్యులు

వేల్పూర్: దీపావళి పండగను పురస్కరించుకొని గురువారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి కుటుంబసభ్యులతో దీపావళి సంబరాలను జరుపుకున్నారు. అంతకు ముందు తన నివాసంలో లక్ష్మీ దేవికి కుటుంబ సభ్యులతో కలిసి పూజలు నిర్వహించి గోమాతను పూజించారు. అనంతరం కుటుంబసభ్యులతో కలిసి ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి టపాకాయలు కాల్చారు.

దీపావళి సంబరాలు జరుపుకుంటున్న మున్సిపల్ చైర్‌పర్సన్

ఆర్మూర్‌టౌన్: మున్సిపల్ పరిధిలోని మహాలక్ష్మీ కాలనీలో గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల్ దేవి లావణ్య శ్రీనివాస్ కుటుంబసభ్యుతో కలిసి దీపావళి సంబరాలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా లక్ష్మీదేవి చిత్రపటానికి పూజలు నిర్వహించి కుటుంబసభ్యులతో కలిసి టపాకాయలు కాల్చారు.

లక్ష్మీదేవి పూజలో పాల్గొన్న టీజీఎస్‌డీసీ చైర్మన్

వేల్పూర్: దీపావళి పండగను పురస్కరించుకొని గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ కార్యాలయంలో నిర్వహించిన లక్ష్మీదేవి పూజ కార్యక్రమంలో టీజీఎస్‌డీసీచైర్మన్ అన్వేష్‌రెడ్డి పాల్గొన్నారు. సంస్థ ఎండి, ఐఏఎస్ ఉదయ్‌కుమార్‌తో కలిసి అన్వేష్‌రెడ్డి లక్ష్మీ దేవికి పూజలు నిర్వహించారు. అనంతరం కుటుంబసభ్యులతో కలిసి టపాకాయలు కాల్చారు.

జక్రాన్‌పల్లి: మండలంలోని అన్ని గ్రామాటల్ల దీపావళి వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. అన్ని గ్రామాల్లో ప్రజలు తమ ఇంటి వద్ద దీపాలు వెలిగించి టపాకాయలు కాల్చి ఆనందోత్సవాల మధ్య దీపావళి వేడుకలను జరుపుకున్నారు.

కమ్మర్‌పల్లి: మండలవ్యాప్తంగా గురువారం రాత్రి కమ్మర్‌పల్లి మండల ప్రజలు దీపావళి పర్వదినాన్ని ఘనంగ జరుపుకున్నారు. రాత్రి తమతమ ఇండ్లలో, దుకాణాలలో లక్ష్మీపూజలు నిర్వహించి ప్రసాదాలు పంపిణిచేశారు. అందరు సుఖశాంతులతో ఉండేలా చూడాలని పూజల్లో వేడుకున్నారు. పరస్పరం దీపావళి శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

ఘనంగా పత్రీజీ జయంతి

ముప్కాల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ముప్కాల్ మండలంలోని నాగంపేట్ గ్రామంలో శుక్రవారం పీరమిడ్ ధ్యాన మండలి, శాఖహార ఉద్యోగకర్త పత్రీజీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ధ్యానం వల్ల ఆనందం, ఆరోగ్యం కలుగుతుందని, శాఖాహారం భుజించి మూగ జీవులను సంరక్షించాలంటు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాయి కృష్ణరెడ్డి, మామిడి లక్ష్మారెడ్డి, దయానంద్, లక్ష్మణ్, ప్రేమ్‌సాగర్ పాల్గొన్నారు.

అభివృద్ధి చేసిన పార్టీపై ఆరోపణలు మానుకోవాలి

భీమ్‌గల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం కె.చంద్రశేఖర్‌రావు రాష్ట్రంలో చేపట్టిన అభివృద్ధిని మరచి మానాల మోహన్‌రెడ్డి చేస్తున్న అసత్య ప్రచారాలు వెంటనే మానుకోవాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దొన్కంటి నర్సయ్య అన్నారు. శుక్రవారం పట్టణ కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ కేసీఆర్ హయంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలను అందిస్తూ సమన్వయంతో ముందుకెళ్లారని కానీ కాంగ్రెస్ రాజకీయ లబ్ధి కోసం ఎన్నికలకు ముందు లేనిపోని వాగ్దానాలను ఇచ్చి వాటిని నెరవేర్చకపోగా బీఆర్ఎస్‌పై లేనిపోని ఆరోపణలు చేస్తూ ప బ్బం గడుపుతున్నారు. ఈ సమావేశంలో మాజీ జడ్పీటీసీ రవి, కౌన్సిలర్ నర్సయ్య, నాయకులు మోహన్, శర్వమనాయక్, తుక్కాజీ, నీలం రవి, పాల్గొన్నారు.

శుక్రవారం దేవి ఆలయానికి రూ.4లక్షల విరాళం

ముప్కాల్, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నిర్మిస్తున్న శుక్రవారం దేవి ఆలయానికి రూ.4లక్షల విరాళాన్ని ముప్కాల్ వాస్తవ్యులు నాయకుడు సంతోష్ తన వ్యాపార భాగస్వాములతో కలిసి ఆలయ కమిటీకి అందజేశారు. ఈ సందర్భంగా సంతోష్‌కు వారి వ్యాపార భాగస్వాములకు ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

సర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

● జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వాజీద్ హుస్సేన్

రెంజల్, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మార్గదర్శకాలను తుచ తప్పకుండా పాటిస్తూ సర్వేను పకడ్బందిగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేక అధికారి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వాజీద్ హుస్సేన్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి సంబంధించిన సర్వేను ప్రభుత్వం ఈ నెల 6వ తేది నుండి ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న సమగ్ర కుటుంబ సర్వేను పక్కాగా అమలు పర్చేలా కృషి చేయాలని సూచించారు. ఇంటింటి కుటుంబ సర్వేకు సంబంధించి ప్రణాళిక ఈ పాటికే తయారు చేయడం జరిగిందన్నారు. సర్వేకు సంబంధించిన స్టిక్కర్లను ఇంటికి అతికించాలన్నారు. ఏ ఒక్క నివాస గృహం సైతం మినహాయించకుండా పక్కాగా పరిశీలన చేయాలన్నారు. ఎలాంటి గందరగోళానికి తావు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రావణ్ కుమార్, ఎంపీడీవో వెంకటేష్, సూపరిండెంట్ శ్రీనివాస్, పీఆర్‌టీయూ మండల కార్యదర్శి కిషోర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

డొంకేశ్వర్, నవంబరు1(ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న భోజన నెలసరి చార్జీలు ప్రభుత్వం పెంచినందుకు గాను శుక్రవారం డొంకేశ్వర్ మండలం నూత్‌పల్లి గ్రామంలోని మహాత్మ జ్యోతి బాపూలే గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయులు సీఎం రేవంత్‌రెడ్డి, భట్టివిక్ర మార్క, పొన్నం ప్రభాకర్‌ల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. చార్జీలను పెంచడం వల్ల విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందుతుందని అన్నారు.సరైన భోజనం తీసుకోవడం వల్ల ఆరోగ్యంతో పాటు చదువుపై దృష్టి పెడతారన్నారు.

క్రీడా స్ఫూర్తితో జీవితంలో రాణించాలి

● ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి



ప్రథమస్థానంలో సాధించిన జట్టుకు బహుమతులు అందజేస్తున్న ఏసీపీ

మెండోర, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): క్రీడా స్ఫూర్తితోనే జీవితంలో రాణించాలని గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించే మనస్తత్వం ప్రతీ ఒక్కరికి అవసరమని క్రీడల్లో ఉండే ప్రధాన సూత్రం ఇదేనని ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో మూడు రోజులుగా అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన మాకూరి వినోద్, గుంటి రవి స్మారక కబడ్డీ, వాలీబాల్ పోటీలు ముగిశాయి. కబడ్డీ విజేత నడిమితాండా, వాలీబాల్ విజేత హసాకొత్తూర్ జట్లకు ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి బహుమతి అందజేవారు. ఈ సందర్భంగా ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడల్లో మానసికోల్లాసానికి ప్రజలకు పోలీసుల మధ్య స్నేహభావానికి ప్రతీకగా నిలుస్తాయన్నారు. గ్రామాల్లో ఉన్న యువత చెడు అలవాట్లకు బానిసలు కాకుండా గ్రా మాలకు ఉపయోగపడే కార్యక్రమాలు నిర్వహించి గ్రామాల అభివృద్ధికి పాటు పడాలని, గ్రామాభివృద్ధి చెందాలంటే యువత చేతుల్లోనే ఉందన్నారు. క్రీడలు కనుమరుగవుతున్నాయని పల్లెల్లో క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తింటి ముత్యంరెడ్డి, సాయిరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు శ్యామ్, నరేందర్, అన్వేష్, రాజేందర్, హరిష్, నరేందర్, అంబేద్కర్ యూత్ సభ్యులు మహేష్, గణేష్ పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి

● మున్సిపల్ చైర్మన్ తూము పద్మ శరత్‌రెడ్డి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మున్సిపల్ చైర్మన్

బోధన్ రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగుతూ ఆర్థికంగా బలోపేతం కావాలని బోధన్ మున్సిపల్ చైర్మన్ తూము పద్మ శరత్‌రెడ్డి అన్నారు. బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్త్రీశక్తి క్యాంటిన్‌ను శుక్రవారం జ్యోతి ప్రజ్వలన అనంతరం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి మహిళల ఆర్థిక సంక్షేమం కోసం ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారన్నారు. మహిళలు ఐకృతగా పని చేసుకుంటూ వ్యాపారంలో ముందుకు సాగుతున్న వారికి ప్రతి ఒక్కరు ప్రోత్సహించాలని కోరారు. ప్రజలు స్త్రీశక్తి క్యాంటిన్ సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళల సంక్షేమం కోసం బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ఎంతగానో కృషి చేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ, కౌన్సిలర్‌లు శరత్ రెడ్డి, శ్రీకాంత్ గౌడ్, ఇంద్రకరణ్, బొగ్గుల ప్రభాకర్, వకీల్, మెప్మా అధికారి శ్రీనివాస్, మహిళ సంఘ సభ్యులు తదితరులున్నారు.

మహిళల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

బోధన్‌రూరల్: మహిళ సమాఖ్య సభ్యులు ఆర్థికంగా బలోపేతం అయి కోటీశ్వరులు కావాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని ఇందుకోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు చేపడుతున్నారని మున్సిపల్ చైర్మన్ తూము పద్మ శరత్ రెడ్డి అన్నారు. శుక్రవారం బోధన్ మున్సిపల్ సమవేశ మందిరంలో పట్టణ సమాఖ్య మహజన సభ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ, జిల్లా కోఆర్డిటర్ మాధురిలత, మెప్మా టౌన్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, కమ్యూనిటీ ఆర్గనైజర్‌లు, స్త్రీనిధి మేనేజర్ వరలక్ష్మి, సమాఖ్యల రిసోర్స్ పర్సర్లు, వివిధ సమాఖ్యల అధ్యక్షులు పాల్గొన్నారు.

శ్రీ కాలభైరవ స్వామి ఆలయంలో వైభవంగా గైరీ వ్రతం



శ్రీ కాలభైరవ స్వామి ఆలయంలో కిటకిటలాడిన భక్తులు

రామారెడ్డి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న శ్రీ కాల భైరవ స్వామి ఆలయంలో శుక్రవారం వైభవంగా గౌరీ వ్ర తం నిర్వహించారు. కామారెడ్డి, జగిత్యాల, రాజన్న, సిరిసిల్ల తదితర జిల్లాల భక్తులు అధిక సంఖ్యలో హాజరైన భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ గర్భగుడిలో సింధూర, ప్రత్యేక పూజలు, అభిషేకాలు, పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం నాగదేవత, శివాలయం, నవగ్రహాల గుడి దేవుళ్లకు మొక్కులు మొక్కి పూజలు నిర్వహించారు. అంతకు ముందు ఆలయం ఆవరణలో గల బావి నీటితో స్నానాలు చేసి తడి బట్టలతో భైరవుని గర్భగుడిలో పూజలు నిర్వహించారు. ఆలయ పురోహితులు శ్రీనివాస్ శర్మ మంత్రోశ్చరణలతో భక్తు లను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ బుర్ల ప్రభు రాంచంద్రం ఉప్ప, జూనియర్ అసిస్టెంట్ లక్ష్మణ్, సిబ్బంది నాగరాజు, వ్యాపారులు వైద్యులు, రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

ఇంటింటా సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

● బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో



కార్యాలయ సిబ్బంది రిజిష్టర్ తనిఖీ చేస్తున్న సబ్ కలెక్టర్

మోస్రా, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): చందూర్ మండలంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని శుక్రవారం బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మండలంలోని ప్రతీ కుటుంబానికి సంబంధించిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల వివరాల సేకరణకు ప్రభుత్వం ఈ నెల 6వ తేదీ నుంచి ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను మండలంలో పకడ్బందీగా నిర్వహించేలా అన్ని చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇందిరా గాంధీ సేవలు మరువలేనివి

బోధన్‌రూరల్, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని ఇందిరా గాంధీ దేశానికి చేసిన సేవలు మరువలేనివని టీపీసీసీ డెలిగేట్ గంగా శంకర్ అన్నారు. గురువారం స్వర్గీయ మాజీ ప్రధాని ఇందిరా గాంధీ 40వ వర్థంతిని పురస్కరించుకుని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బోధన్ పట్టణంలో పాత బస్టాండ్‌లో ఇందిరా గాంధీ చౌక్‌లో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విగ్రహనికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఇందిరా గాంధీ ఎంతోమంది నిరుపేదలకు సహయ, సహకారాలు అందించారని, బ్యాంకులను కూడా నేషనలైజ్ చేసి ఆదుకోవడం జరిగిందన్నారు. ఆమె దేశానికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు పాషా మొయినోద్దీన్, కౌన్సిలర్ శరత్ రెడ్డి, శ్రీకాంత్ గౌడ్, దాము, విష్ణువర్ధన్ రెడ్డి, వైద్య, ఉద్మీర్ సాయిలు, సంగ్రామ్, అబ్దుల్లా, సలీం, బడులతో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ క్రియాశీల సభ్యత్వం అందజేత

ఆర్మూర్‌టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్ర మంలో భాగంగా సీనియర్ నాయకుడు లోక భూపతిరెడ్డి బీజేపీ క్రియా శీల సభ్యత్వాన్ని నాయకులకు అందజేశారు. ఇటీవల బీజేపీ సభ్యత్వ నమోదును చురుకుగా పాల్గొని వంద మందిపైగా సభ్యత్వ నమోదు చేసిన వారికి క్రియాశీల సభ్యత్వాన్ని అందజేసినట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి కలిగోట గంగాధర్, పట్టణ అధ్యక్షుడు ద్యాగ ఉదయ్, ప్రధానకార్యదర్శి పొల్కం వేణు, ఆరే రాజేశ్వర్, కలిగోట ప్రశాంత్ పాల్గొన్నారు

కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి

ఏర్గట్ల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చి మద్దతు ధర పొందాలని తాళ్లరాంపూర్ సొసైటీ చైర్మన్ పెద్దకాపుల శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని తాళ్లరాంపూర్ సొసైటీ వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలకు లోబడి ధాన్యాన్ని తీసుకొచ్చి ఏ గ్రేడు రూ. 2320/-లు, బి గ్రేడు రూ. 2300/-లు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమ్మర్‌పల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొరిపెల్లి లింగారెడ్డి, డైరెక్టర్‌లు సోమ దేవరెడ్డి, దేశబోయిన చిన్న సంజీవ్, రవీందర్, ఏర్గట్ల సొసైటీ చైర్మన్ బర్మ చిన్న నర్సయ్య, ఎన్‌డీసీసీ మేనేజర్ దేవేందర్, ఎఈవో సాయిసచిన్, కార్యదర్శి గణేష్‌లు పాల్గొన్నారు.

ఘనంగా దీపావళి

• లక్ష్మీదేవికి ఘనంగా పూజలు • బాణాసంచాలతో వేడుకలు • అర్ధరాత్రి వరకు కొనసాగిన పూజలు





ఇంట్లో బొమ్మల కొలువు

దీపాలు వెలిగిస్తున్న దృశ్యం



పూలకుండీని కాలుస్తున్న దృశ్యం

నిజామాబాద్ కల్చరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా దీపావళి పర్వదినాన్ని గురువారం ఘనంగా జరుపుకున్నారు. దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయాల్లో, వ్యాపార సముదాయాల్లో ఘనంగా పూజలు నిర్వహించారు. వ్యాపార సముదాయాలు, ఇండ్లల్లో లక్ష్మీదేవికి దీపాలతో ఘనంగా స్వాగతం పలికారు. దీపాలను, విద్యుత్ దీపాలను అలంకరించి ముస్తాబు చేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు ఆలయాల్లో ఉదయం నుండి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు కొనసాగాయి. ఆలయాల్లో లక్ష్మీదేవికి ఘనంగా పూజలు నిర్వహించి సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. బాణాసంచాలతో, టపాసులతో అర్ధరాత్రి వరకు దీపావళి పర్వదినాన్ని జరుపుకున్నారు. దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని బంధువులు, స్నేహితులు ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకుంటూ పాలతో కూడిన పేనీలు, సేమియా పాయసాలతో పండుగను చేసుకున్నారు.

వ్యాపార సముదాయాల్లో ఘనంగా లక్ష్మీదేవి పూజలు

లక్ష్మీ అనుగ్రహానికై వ్యాపారులు లక్ష్మీదేవికి ఘనంగా పూజలు నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా దీపావళి పండుగను పురస్కరించుకొని వ్యాపారులు, వివిధ ఏజెన్సీ, ఎంటర్‌ప్రైజెస్‌లు పండుగను పురస్కరించుకొని తమ తమ కార్యాలయాలను అరిటాకులు, మామిడాకులు, విద్యుత్ దీపాలు, దీపాలతో అలంకరించి లక్ష్మీదేవి పూజలను జరుపుకున్నారు. లక్ష్మీదేవి పూజలు నిర్వహించేటప్పుడు పెద్దఎత్తున టపాసులను కాలుస్తూ అమ్మవారికి ఘనంగా స్వాగతం పలికారు. వేదపండితులు వేదమంత్రోచ్చరణలతో అమ్మవారికి వేదోక్తంగా పూజలు జరిపారు. లక్ష్మీదేవి మమ్మల్ని చల్లగా చూడమని వేడుకుంటూ వరి పేలాలు, తీపి పదార్థాలను నైవేద్యంగా పెట్టి అమ్మవారిని వేడుకున్నారు. అమావాస్య మధ్యాహ్నం రావడంతో వ్యాపార సముదాయాలు పూజలను ప్రారంభించి అర్ధరాత్రి వరకు అమ్మవారి పూజలో నిమగ్నమయ్యారు. పలు ప్రాంతాల్లో అర్ధరాత్రి అమ్మవారిని పూజిస్తే లక్ష్మీ కటాక్షం కలుగుతుందని తెలియడంతో అర్ధరాత్రి అమ్మవారి పూజలను నిర్వహించి ఉదయం వరకు జాగరణ చేశారు.

టపాసుల మోత

దీపావళి పర్వదినాన్ని జిల్లా వ్యాప్తంగా బాణాసంచాలు, టపాసుల మోతతో వేడుకగా జరుపుకున్నారు. ఇండ్లు, వ్యాపార సముదాయాల్లో టపాసులు, బాణాసంచాలను పేలుస్తూ పండుగను నిర్వహించారు. 200 వాలా, 500 వాలా, 1000 వాలా, 5000 వాలా షాటర్స్‌లతో పాటు చిచ్చుబుడులు, సుతిలి బాంబులు, చోటాభీమ్, షేర్ పటాకులు, చక్రాలు, తదితర టపాసులు పేలుస్తూ సందడి చేశారు.

శుభ ముహూర్తంతో వ్యాపారం ప్రారంభం

వ్యాపారాన్ని శుభముహూర్తంలో ప్రారంభించడానికి వ్యాపార వర్గాలు ఈపాటికే ముహూర్తాన్ని ఖరారు చేశాయి. శుక్రవారం అమావాస్య ఉండటంతో శుభముహూర్తాన్ని శనివారం ప్రారంభించామని నిర్ణయించారు. శనివారం ఉదయం 10 తర్వాత వ్యాపారాన్ని ప్రారంభించడానికి సన్నాహాలు చేసుకుంటున్నారు. శుభముహూర్తము వ్యాపారం ప్రారంభించడం వల్ల సంవత్సరం పాటు వ్యాపారం జోరుగా సాగుతుందని వ్యాపార వర్గాలు విశ్వసిస్తారు. దీంతో వ్యాపార వర్గాలు ఈపాటికే పండితుల దగ్గర నుంచి శుభ ముమూర్తాన్ని తీసుకొని తమకు ఆనవాయితీగా వస్తున్న వారితో వ్యాపారాన్ని ప్రారంభించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

బొమ్మల కొలువు

దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని వివిధ ప్రాంతాల్లో బొమ్మల కొలువును ఏర్పాటు చేశారు. వివిధ రకాల బొమ్మలను అందంగా ముస్తాబు చేసి అందులో లక్ష్మీదేవిని ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదమంత్రాలతో లక్ష్మీ నారాయణుడికి వివాహం చేసి చుట్టుపక్కల బంధువులకు విందును అందజేసి బొమ్మల కొలువును ఘనంగా జరుపుకున్నారు. బొమ్మల కొలువు చేసుకున్న వారికి లక్ష్మీనారాయణుడి అనుగ్రహం లభిస్తుందని శాస్త్రంలో తెలపడంతో బొమ్మల కొలువు ఏర్పాటు చేసుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి ముత్తయిదువులకు వాయినాలను ఇచ్చుకున్నారు. జిల్లా కేంద్రంలోని సరస్వతీనగర్‌లో లావణ్య బొమ్మల కొలువును ఏర్పాటు చేసుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గత పదిహేను సంవత్సరాలుగా బొమ్మల కొలువు కోసం వివిధ ప్రాంతాల్లో బొమ్మలను కొనుగోలు చేసి పూజించడం ఆనవాయితీగా వస్తుందని అన్నారు.



బొమ్మల కొలువు



లక్ష్మి పూజలు చేస్తున్న దృశ్యం

సీసీఐ కొనుగోళ్లపైనే

పత్తి రైతుల ఆశలు!

• ముందు నుంచి కొనుగోలు చేస్తేనే ధరల్లో నిలకడ • లేదంటే పత్తి దళారుల పాలయ్యే అవకాశం

• మద్నూర్‌లోని 8 జిన్నింగ్ మిల్లుల్లో కొనుగోలు కేంద్రాలు సిద్ధం చేసిన సీసీఐ

మద్నూర్, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): పత్తి సిజన్ ప్రారంభమైంది. ఇప్పుడిప్పుడే మార్కెట్‌కి పత్తి వస్తోంది. భారీ వర్షాలతో పత్తి పంట దెబ్బతిన్న తర్వాత కొనుగోలు ప్రస్తుతం పంట చేతికొచ్చే దశకు వచ్చింది. వర్షాలు తగ్గిన తరువాత కాయపగలడంతో కొత్తపత్తి మార్కెట్‌కు వస్తోంది. దీపావళి తర్వాత మార్కెట్‌లో పత్తి కొనుగోలు ముమ్మరమయ్యే అవకాశముంది. కామారెడ్డి జిల్లాలో సుమారు 34వేల ఎకరాల్లో పత్తి సాగైంది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం పత్తి పంట క్వింటాకు మొదటి రకానికి రూ.7,521, రెండో రకానికి రూ.7,300 మద్దతు ధర నిర్ణయించారు. ప్రస్తుతం జిల్లాలోని మద్నూర్ మార్కెట్‌లో వ్యాపారస్తులు కొత్తపత్తిని క్వింటాకు రూ.7వేల వరకు పెట్టి కొనుగోలు చేస్తున్నారు. ఉత్పత్తి పెరిగి మార్కెట్‌కు అధికంగా పత్తి వస్తే క్రమంగా ధర క్వింటాకు రూ.6వేల వరకు పడిపోయే అవకాశముంది. నాణ్యత బాగాలేదని, వర్షాలతో నల్ల బడిందని సాకులు చెప్పి వ్యాపారస్తులు సిండికేట్‌గా మారి క్వింటాకు వెయ్యివరకు ధర తగ్గించే అవకాశాలున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో సీసీఐ పత్తి కొనుగోళ్లు ముందుండాలని రైతులు కోరుతున్నారు.

కామారెడ్డి జిల్లా మద్నూర్‌లో సీసీఐ కొనుగోలు కేంద్రాలకు ప్రణాళిక సిద్ధం చేసింది. మద్నూర్ మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ పరిధిలోని జన్నింగ్ బిల్లులోనే సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు సీసీఐ ఇంచార్జి అధికారి ఓబుల్‌రెడ్డి వెల్లడించారు. గత ఏడాది జిల్లాలో సుమారు 69 వేల క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేశారు. ఈ ఏడాది దిగుబడులు పెరిగితే సీసీఐ ఎక్కువ మోతాదులో కొనుగోలు చేసే అవకాశం ఉంది. జిల్లాలో అత్యధికంగా పత్తి పండించే మార్కెట్ యార్డుల్లో సీసీఐ కొనుగోలుకేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతు సంఘాలు సూచిస్తున్నాయి. జిన్నింగ్ మిల్లుల వద్దనే కాకుండా పత్తి ఉత్పత్తి జరిగే మండల కేంద్రాల్లో కూడా సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరుకుంటున్నారు. రైతులకు అందుబాటులో కొనుగోలు కేంద్రం ఉంటే పత్తిని అమ్ముకొని అవకాశం ఉంటుంది. దీని వల్ల ప్రైవేట్ వ్యాపారులు దళారులు పత్తి కొనుగోలు పోటీపడి చేసే అవకాశం ఉంది. ఈ ఏడాది బంగ్లాదేశ్ తదితర దేశాల్లో పత్తి పంట దెబ్బతిన్నదని ఎగుమతి ఆర్డర్లు అధికంగా ఉండే అవకాశం ఉందని, వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ పరిస్థితుల నేపథ్యంలో పత్తి ధర తగ్గకుండా ఉండేందుకు ప్రభుత్వం ఎక్కువ సంఖ్యలో కొనుగోలు కేంద్రాలు పెడితే రైతులకు లాభదాయకంగా ఉంటుందని, ప్రతీయేటా వ్యవసాయ మార్కెట్‌లో ప్రతీ సీజన్ ప్రారంభం కాగానే ఎక్కువ లాట్లు వచ్చినప్పుడు నాణ్యత లేదని వర్షాలకు దెబ్బతిన్నదని పలు కారణాలు చెబుతూ సీసీఐ ధర కంటే ప్రైవేట్‌లో తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. క్వింటాల్‌కు వెయ్యి నుంచి 1500 వరకు రైతులు నష్టపోతున్నారు. కొందరు ప్రైవేట్ వడ్డీ వ్యాపారులు కమిషన్ ఏజెంట్లు ముందుగానే రైతులకు పెట్టుబడులు పెట్టి రైతులు అమ్మిన పత్తిపై కమిషన్‌తో పాటు పెట్టిన పెట్టుబడిని అధిక వడ్డీలు వసూలు చేస్తూ లాభం పొందుతుండగా మరోవైపు రైతు తప్పనిసరిగా పెట్టుబడిదారుడిని అమ్మే పరిస్థితి ఉన్నందున ధరలో కూడా కొంత కోత విధిస్తున్నారు. దీంతో రైతులు తమకు తెలియకుండానే క్వింటాల్‌కు రూ.1500 నుంచి 2000 వరకు నష్టపోతున్నారు. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఎక్కువ సంఖ్యలో ప్రారంభించి కొనుగోలు చేయాలని రైతు సంఘాల నాయకులు అభిప్రాయపడుతున్నారు.



జిల్లాలో పత్తి పంట



మద్నూర్ మార్కెట్ యార్డు ముఖద్వారం

34వేల ఎకరాలలో పత్తి సాగు

• తిరుమల ప్రసాద్, జిల్లా వ్యవసాయ అధికారి

కామారెడ్డి జిల్లా పరిధిలో ఈఏడాది 34వేల ఎకరాలలో రైతులు పత్తి సాగుచేశారు. ఎకరానికి పది క్వింటాళ్ల చొప్పున 33,788.29 మెట్రిక్ టన్నుల పత్తి సాగయ్యే అవకాశం ఉంది.

రైతుల నుంచి పత్తి కొనుగోలు చేస్తాం

• ఓబుల్‌రెడ్డి, సీసీఐ ఇన్‌చార్జి అధికారి

రైతుల నుంచి వచ్చే పత్తి పంటను కొనుగోలు చేయడానికి ఇప్పటికే 8 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని దీపావళి తరువాత పత్తి కొనుగోలు ప్రారంభిస్తామని వెల్లడించారు. గత ఏడాది సీసీఐ కొనుగోలు కేంద్రాల ద్వారా 69 వేల క్వింటాళ్ళ పత్తిని రైతుల నుంచి కొనుగోలు చేశాం. రైతుల నుంచి వచ్చే పత్తి పంట చివరి వరకు కొనుగోలు చేస్తాం.

'విద్యుత్ చార్జీలపై విజయోత్సవాలు హాస్యాస్పదం'



మాట్లాడుతున్న మానాల మోహన్‌రెడ్డి

భీమ్‌గల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీలపై బీఆర్‌ఎస్ విజయోత్సవాలు జరుపుకోవడం హస్యాస్పదంగా ఉందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడారు. గత పదేళ్ల అధికారంలో ఉన్నప్పుడు గృహ వ్యాపార విద్యుత్ చార్జీలు పెంచి వినియోగదారుల నడ్డి విరిచిన బీఆర్‌ఎస్ నాయకులు ప్రస్తుతం విద్యుత్‌చార్జీలపై విజయోత్సవాలు జరుపుకోవడం ఏంటని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీమేరకు రాష్ట్రంలో 200యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌కు అందిస్తుండగా బీఆర్‌ఎస్ నాయకులు మాత్రం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. 2023-24లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారం కోల్పోయే నాటికి రూ.20వేల కోట్ల విద్యుత్‌చార్జీలు ప్రజలపై భారం మోపిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బోదిరెస్వామి, పట్టణ అధ్యక్షుడు నర్సయ్య, జిల్లా ప్రధానకార్యదర్శి కుంట రమేష్, ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు అనంతరావు, ఎస్టీసెల్ మండల అధ్యక్షుడు గోపాల్‌నాయక్, బీసీసెల్ మండల అధ్యక్షుడు కోరాడి రాజు, బాల్కొండ నియోజకవర్గ యువజన అధ్యక్షుడు నాగేంద్రబాబు, నాయకులు పాల్గొన్నారు.

పేకాట ఆడిన వారిపై కేసులు

• 597 మందిపై 116 కేసులు • రూ.11,47, 240 నగదు స్వాధీనం: ఇన్‌చార్జి సీపీ సింధూ శర్మ

ఖిల్లా, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా ఆనవాయితీగా వస్తున్న పేకాటను అరికట్టేందుకు పోలీసు శాఖ తీవ్ర కసరత్తు చేసింది. పోలీసు కమిషనరేట్ పరిధిలో మొత్తం 597 మందిపై 116 కేసులు నమోదు చేసి వారి వద్ద నుంచి రూ.11,47, 240 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌చార్జీ సీపీ సింధూశర్మ తెలిపారు. ఈ మేరకు ఓ ప్రకటనలో తెలిపారు. దీపావళి పండుగను పురస్కరించుకుని గురు, శుక్రవారాల్లో పోలీసు కమిషనరేట్ పరిధిలో పేకాటను పేకాటరాయుళ్లు కొనసాగించారు. ముందస్తుగానే రహస్య స్థావరాలను ఏర్పాటు చేసుకుని పేకటాను లక్ష్మి పూజల అనంతరం నిర్వహించారు. అటువంటి వారిని గుర్తించిన పోలీసులు పేకాట రాయుళ్లను పట్టుకుని వారిపై కేసులు నమోదు చేశారు. నిజామాబాద్ డివిజన్‌పరిధిలో మొత్తం కేసులు 53, 267మంది అరెస్ట్, రూ. 5,03,570 నగదు స్వాధీనం, ఆర్మూర్ డివిజన్‌లో 26 కేసుల్లో 138 మంది అరెస్ట్, రూ.2,85,570 నగదును స్వాధీనం చేసుకున్నారు. బోధన్ డివిజన్‌లో మొత్తం కేసులు 37నమోదు చేసి 192 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.3,58,100 నగదును స్వాధీనం చేసుకున్నాట్లు తెలిపారు. దీపావళి పండుగలో పేకాటను నియంత్రించేందుకు ప్రత్యేక పోలీసు సిబ్బంది నిఘా పెట్టారని తెలిపారు. అయినప్పటికీ గతేడాదితో పోల్చితే ఈ ఏడాది పోలీసులు పట్టుకున్నది సగభాగమేనని తెలిసింది.

టాస్క్‌ఫోర్ బృందాలు కరువు

నగరంలో పోలీసు కమిషనర్ లేని లోటు కనిపించింది. పేకాటను నియంత్రించేందుకు గతంలో ప్రత్యేకంగా టాస్క్‌ఫోర్స్ బృందాలు పటిష్టమైన నిఘా పెట్టి సుమారు 23 లక్షలకు పైగా నగదును పట్టుకున్నారు. కానీ ఈ ఏడాది టాస్క్ ఫోర్స్ బృందాలు లేకపోవడంతో పాటు పోలీసు కమిషనర్ బదిలీపై వెళ్లడం కూడా పేకాట రాయుళ్లకు కలిసి వచ్చింది. స్థానిక పోలీసులకు అందకుండా రహస్య ప్రదేశాల్లో పేకాటను కొందరు యథేచ్ఛగా నిర్వహించారు. దీపావళి పండుగకు పేకాట ఆడొద్దని పోలీసులు పదే పదే ఆదేశాలు జారీ చేసినప్పటికీ పేకాటను జోరుగా కొనసాగించారు. అయితే మార్కెట్‌లో డబ్బుల కొరత ఉండడంతో చాలా మంది పేకాట ఆడేందుకు ఆసక్తి ఉన్నా చేతిలో డబ్బులు లేక పేకాటకు దూరంగా ఉన్నట్లు తెలిసింది.

నగర పాలక సంస్థ జోన్-5లో

శానిటరీ ఇన్‌స్పెక్టర్ వర్సెస్ జవాన్

• జవాన్‌పై శానిటరీ ఇన్‌స్పెక్టర్ దాడి? • గత 15రోజుల క్రితం ఎస్సైపై జవాన్ల ఫిర్యాదు

• దాడి జరగలేదన్నట్లు జవాన్లతోనే జవాన్‌పై ఫిర్యాదు



నగరంలోని మున్సిపల్ కార్యాలయం

సుభాష్‌నగర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ పరిధిలోని జోన్-5 కార్యాలయం వివాదాలకు కేంద్ర బింధువుగా మారుతోంది. ఉదయం శానిటరీ ఇన్‌స్పెక్టర్ జవాన్‌పై దాడిచేసినట్లు తెలిసింది. జోన్-5లో పనిచేస్తున్న సిబ్బంది హాజరువిషయంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ జవాన్‌కు మధ్య గొడవ జరిగినట్లు సమాచారం. శానిటరీ ఇన్‌స్పెక్టర్ జవాన్‌ల మధ్య మాటామాట పెరిగి కొట్టుకునే వరకూ వెళ్లింది. దీంతో అక్కడున్నవారు కలుగజేసుకొని గొడవను సర్దుమనిగించారు. గత 15రోజుల క్రితం శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై జవాన్‌లు అందరూ తమను ఇష్టారీతిన తిడుతున్నాడని నగర పాలక సంస్థ కమిషనర్ మంద మకరంద్‌కు ఫిర్యాదు చేశారు. అప్పటి ఫిర్యాదుపై కమిషనర్ ఇద్దరినీ పిలిపించి సమస్యను పరిష్కరించారు. జవాన్‌లు ఫిర్యాదు చేస్తున్నారన్న అప్పటి సమాచారంతో అందులోని జవాన్‌లను ముందే కలుసుకొని తమకు అనుకూలంగా మార్చుకున్నారు. ఇదంతా 15 రోజుల క్రితం జరుగగా మళ్లీ శుక్రవారం ఉదయం శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు జవాన్‌కు మధ్య ఘర్షణ జరిగింది. ఈ గొడవపై జవాన్‌లందరూ మరో బాధిత జవాన్‌కు మద్దతుగా కమిషనర్‌కు ఫిర్యాదు చేసేందుకు వెళ్లినట్లు సమాచారం. జవాన్‌పై జవాన్‌లు ఫిర్యాదు చేసుకోవడం కొసమెరుపు. నూతన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన దిలీప్‌కుమార్ ఈగొడవపై ఎలా స్పందిస్తారో చూడాలి.

కార్తీక మాసంలో

నిత్య దీపారాధనతో సకల శుభాలు

బోధన్‌రూరల్, నవంబరు1(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంలో నిత్య దీపారాధన చేస్తే సకల శుభాలు కలుగుతాయని శివాలయం అర్చకులు, వేద పండితులు గణేష్ మహరాజ్ అన్నారు. శుక్రవారం దేవాదాయ కమిషనర్ ఆదేశాల మేరకు కార్తీక మాసాన్ని పురస్కరించుకుని నిత్య దీపోత్సవం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కరపత్రాలను విడుదల చేశారు. ఆలయంలో ప్రతినిత్యం దీపారాధన కార్యక్రమం ప్రతీరోజు సాయంత్రం ఆకాశ దీపోత్సవ కార్యక్రమం, ప్రతీ సోమవారం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం, రాత్రి స్వామివారి పల్లకిసేవ, 14న సామూహిక సత్యనారాయణ వ్రతం, 15న సాయంత్రం లక్ష వత్తుల దీపోత్సవం నిర్వహించబడుతుందని, కార్తీకమాసం మాస శివరాత్రి రోజు ఉదయం 10:30 గంటలకు శివపార్వతుల కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో దేవాదాయ ధర్మదాయ శాఖ కార్యనిర్వహణ అధికారి శ్రీరాం రవీందర్, సహాయ కమిషనర్ విజయ రామరావు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు



ప్రమాదకరంగా కిందికి వేలాడుతున్న విద్యుత్ తీగలు

డొంకేశ్వర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాకపోకలకు సులువుగా ఉండేందుకు మండలంలోని తొండాకూర్, కుద్వాన్‌పూర్ గ్రామాలకు మధ్య బ్రిడ్జి నిర్మించారు. అయితే బ్రిడ్జిని ఆనుకొని ఉన్న విద్యుత్ తీగలు ప్రమాదకరంగా మారాయి. నిలబడితే తాకే ఎత్తులో వేలాడుతున్న విద్యుత్ తీగలను చూసి రైతులు, ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. బ్రిడ్జి నిర్మించి ఏడాది అవుతున్న వాటిని సరి చేసి విద్యుత్ అధికారులు ఇప్పటివరకు సరిచేయలేదని స్థానికులు మండిపడుతున్నారు. రాత్రి సమయంలో బ్రిడ్జిపై వాహనదారులు, ప్రయాణించేటప్పుడు విద్యుత్ వైర్లు కనబడక ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని ఆందోళన చెందుతున్నారు. ఈ రహదారి వెంట వివిధ అవసరాల నిమిత్తం సుమారు వందల సంఖ్యలో ప్రయాణిస్తుంటారు. ప్రమాదాలు జరగక ముందే విద్యుత్ అధికారులు మేలుకోవాలని విద్యుత్ తీగలను త్వరగా సరి చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఆంధ్రజ్యోతి సంబంధిత అధికారి ఏఈ రమేష్‌ను వివరణ కోరగా స్తంభాలను పైకి ఎత్తేందుకు ఎస్టిమేట్ సాంక్షన్ అయ్యిందని, పదిరోజుల్లో పనులను పూర్తి చేస్తామని తెలిపారు.

ఘనంగా దీపావళి సంబరాలు


ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు


దోమకొండ కల్లు డిపోలో పూజలు చేస్తున్న గౌడ సంఘ సభ్యులు

బాన్సువాడటౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజలు గురువారం దీపావళి సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. ఉదయం ఇళ్లలో మంగళహారతులను తీసుకున్నారు. నూతన వస్త్రాలను ధరించి పూజలు చేపట్టారు. ఒకరినొకరు పండుగ శుభాకాంక్షలు తెలిపుకున్నారు. సాయంత్రం వ్యాపార సముదాయాలలో, ఇళ్లలో లక్ష్మీదేవి పూజలు చేపట్టారు. అనంతరం టపాసులు పేలుస్తూ సంబరాలను జరుపుకున్నారు.

బీర్కూర్: దీపావళి పండుగ వేడుకలను బీర్కూర్ మండల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. గురువారం మహిళలు ప్రత్యేకంగా లక్ష్మీదేవి పూజలు నిర్వహించారు. సాయంత్రం వేళలో వాకిళ్ల ముందు అందమైన ముగ్గులు వేసి ప్రమిదలు వెలిగించి రకరకాల రంగుల క్రాకర్లు, టపాసులు కాల్చి సందడి చేశారు. బాణసంచా విక్రయాల దుకాణాలు కిటకిటలాడాయి. బాణాసంచా విక్రయ షాపులు కొనుగోలదారులతో కిటకిట లాడాయి. ప్రజలు లక్ష్మీ దేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి బాణసంచాను కాల్చారు. సీట్లను పంపిణీ చేశారు.

మద్నూర్: ఉమ్మడి మద్నూర్ మండలంలో దీపావళి పండుగ ప్రజలు భక్తి శ్రద్ధలతో వైభవంగా జరుపుకున్నారు. జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు మండల కేంద్రంలో జరిగిన దీపావళి ఉత్సవాల్లో పాల్గొన్నారు. దీపాల కాంతులతో ఉమ్మడి మద్నూర్ మండలంలోని వ్యాపార సంస్థలు రంగురంగుల విద్యుత్ దీపాలతో మిరిమిట్లు గొలిపాయి. మూడు రోజుల పాటు దీపావళి పండుగను జరుపుకోవడం అనవాయితీగా వస్తుంది. ధన్‌తెరస్ నుంచి బహు బీజ్ వరకు దీపావళి పండుగ జరుపుకుంటారు. మొదటి రోజు బంగారం కొనుగోలు, రెండో రోజు లక్ష్మీ పూజలు, మూడో రోజు పాడ్యమి పూజలు నిర్వహించారు. ఈ ఏడాది అమావాస్య పండుగ రెండు రోజులు రావడంతో గురువారం, శుక్రవారం అమావాస్య లక్ష్మీ పూజలు జరుపుకున్నారు. శనివారం పాడ్యమి పూజలు జరుపుకోవడానికి వ్యాపారస్తులు ఏర్పాట్లు చేసుకున్నారు.

పెద్ద కొడప్‌గల్: మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు దీపావళి వేడుకలు జరుపుకున్నారు. గురువారం రాత్రి క్యాంపు కార్యాలయంలో లక్ష్మీ పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే నియోజక వర్గ ప్రజలు అభివృద్ధి బాటలో పయనించాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. దీంతో పాటుగానే నియోజక వర్గంలోని ఆయా మండలాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యేకు దీపావళి పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు.

లింగంపేట: మండలంలో దీపావళి సంబురాలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సంవత్సరం పంటలు బాగా పండి ధాన్యం ఇంటికి రావడంతో రైతులు, వ్యాపారులు, రైస్ మిల్లర్స్, హోటల్లు ఇతర వ్యాపార సంస్థలలో దీపాలు, విద్యుత్ దీపాలతో అలంకరించి లక్ష్మీ పూజలు నిర్వహించి ఘనంగా జరుపుకున్నారు. చిన్న పెద్ద తేడా లేకుండా టపాసులు కాల్చి సంబురాలు జరుపుకున్నారు.

దోమకొండ, బీబీపేటలలో..

దోమకొండ: దోమకొండ, బీబీపేట మండలాల్లో గురువారం దీపావళి పండగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. చిన్న, పెద్ద తేడా లేకుండా నూతన వస్త్రాలు ధరించి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురు వ్యాపారసముదాయాల్లో లక్ష్మీ పూజలు నిర్వహించి పటాసులు కాల్చారు. ప్రజలు దీపావళి పండగను ఘనంగా జనుపుకున్నారు.

గిరిజన తండాల్లో దీపావళి వేడుకలు

పెద్ద కొడప్‌గల్: మండలంలోని ఆయా గ్రామాలలో గల గిరిజన తండాలలో గిరిజనులు దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లో ప్రజలు దీపావళి పండుగను జరుపుకుంటే గిరిజన తాండాలలో చిన్నారులు అడవికి వెళ్లి రంగురంగుల పూలు సేకరించి ఇంటికి తీసుక వచ్చి ప్రతీ ఇంటి ముందు గొబ్బెమ్మలు తయారు చేసి పాటలు పాడుతూ ప్రతీ ఇంటి ముందు గొబ్బెమ్మలు ఉంచుతారు. అనంతరం సేవాలాల్ మందిరం వద్ద దీపాలు వెలిగించి మహారాజ్‌ను పూజించారు. ఈ పండుగను గిరిజనులు కోల్‌దావారి మేరా అని పండుగగా పిలుస్తారు. ఈ కార్యక్రమంలో తాండా చిన్నారులతో పాటు మహిళలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

● ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

మాచారెడ్డి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రజల మధ్యలో ఉండి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలో బీజేపీ కార్యవర్గసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో నియోజకవర్గంలో వార్డు సభ్యుని నుంచి జడ్పీ చైర్మన్ వరకు అన్ని స్థానాలు బీజేపీ కైవసం చేసుకోవాలన్నారు. ప్రతి బీజేపీ కార్యకర్త ప్రజల మధ్యలో ఉండి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ముగియనుందని క్రియాశీల సభ్యత్వం కోసం ప్రతీ బీజేపీ నాయకుడు 100 సభ్యత్వాలు చేసి క్రియశీల సభ్యత్వము తీసుకోవాలన్నారు. మండలానికి 100 మంది క్రియాశీల సభ్యులుగా చేరాలన్నారు. అనంతరం మండలానికి సంబంధించి 100 ప్రాథమిక సభ్యత్వాలు పూర్తిచేసిన 24 మందికి సభ్యత్వం అందించారు.

నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

● ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్

ఎల్లారెడ్డి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి పట్టణ పరిధిలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో మిగిలి ఉన్న మౌలిక వసతులు రోడ్డు మురికి కాలువల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్ అన్నారు. శుక్రవారం జరుగుతున్న నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణ పనులు నాణ్యతగా నిర్మించి సకాలంలో పూర్తి చేయాలని సదరు కాంట్రాక్టర్‌కు సూచించారు. ఆయనతో పాటు మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

కామారెడ్డి మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్‌గా గిరిధర్


బదిలీపై వెళ్తున్న కమిషనర్‌ను సన్మానిస్తున్న కౌన్సిలర్‌లు

కామారెడ్డిటౌన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్‌గా టౌన్ ప్లానింగ్ అధికారి గిరిధర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ కమిషనర్‌గా పనిచేసిన సుజాత కొత్తగుడెం జిల్లా పల్వంచ మున్సిపాలిటీకి ఇటీవల బదిలీ కాగా ఆమె శుక్రవారం రిలీవ్ అయ్యారు. కాగా బీఆర్ఎస్ కౌన్సిలర్‌లు బదిలీపై వెళ్తున్న సుజాతను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తక్కువ కాలం మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన ప్రజలకు మెరుగైన సేవలు అందించారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్‌లు పిట్ల వేణుగోపాల్, హఫీజ్‌బేగ్, నజిరోద్దిన్,నాయకులు గెరిగంటి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల ప్రారంభం

లింగంపేట, నవంబర్ 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. ఆసుపత్రి ముందు రోడ్డు పూర్తిగా చెడిపోయి మురికి నీటితో నిండి ఉండడంతో ఆసుపత్రికి వచ్చే రోగులకు ఇబ్బందిగా ఉందని ఆసుపత్రి సిబ్బంది, ఆయా గ్రామాల ప్రజలు నాయకులకు తెలియజేయడంతో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు నారాగౌడ్ ఎమ్మెల్యే మదన్ మోహన్ దృష్టికి తీసువెళ్లగా ఎమ్మెల్యే సీసీరోడ్డును మంజూరు చేశారు. రోడ్డు పనులను నాయకులు ప్రారంభించారు. దీంతో కాలనీవాసులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎల్లమయ్య, ప్రసాద్ గౌడ్, రాజు, రఫీక్, రవి, కిరణ్, అశోక్ ఉన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి దారుణ హత్య

సదాశివనగర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): సదాశివనగర్ మండలం లింగంపల్లి గ్రామ శివారులో గురువారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తి హత్యకు గురైనట్లు ఎస్సై రంజిత్ తెలిపారు. లింగంపల్లి నుంచి జనగాం వెళ్లే రోడ్డు పక్కన గల కంపోస్ట్ షెడ్ సమీపంలో వ్యక్తి హత్య జరిగినట్లు సమాచారం తెలిసిన వెంటనే సీఐ సంతోష్, ఎస్సై రంజిత్‌లు వెళ్లి పరిశీలించారు. హత్యకు గురైన వ్యక్తికి ఎడమచేయి లేదని, కుడి చేతిపై అమ్మ అనే పచ్చబొట్టు, మెడలో ఎర్రదారం రుద్రాక్షతో ఉందని తెలిపారు. ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు తలపై బండరాయితో కొట్టి చంపారని తెలిపారు. సంఘటన స్థలానికి డీఎస్పీ శ్రీనివాస్‌లతో సహా సీఐ, ఎస్సైలు అన్ని కోణాలలో దర్యాప్తులు కొనసాగించగా హత్య చేయబడ్డ వ్యక్తి డిచ్‌పల్లి మండలం ధర్మారం గ్రామానికి చెందిన పిట్టల కృష్ణగా శుక్రవారం గుర్తించామని ఎస్సై రంజిత్ తెలిపారు. హత్యకు గల కారణాలు హత్యలో పాల్గొన్నది ఎంతమంది మృతునికి హత్యచేసిన వ్యక్తికి సంబంధాలేమిటి అనే కోణంలో విచారణ కొనసాగుతుందని ఎస్సై తెలిపారు.

మురుగు కాలువలో పడి వ్యక్తి మృతి

పెద్ద కొడప్‌గల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పెద్ద కొడప్‌గల్ గ్రామ పంచాయతీ పరిధిలో ప్రదాన రహదారి పక్కన గల మురికికాలువలో ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు పడి మృతి చెందినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం బాన్సువాడ మండలం బోర్లం గ్రామానికి చెందిన నాందేడ్ వెంకటేష్(40) బాలికల గురుకుల పాఠశాలలో వంట మనిషిగా పనిచేస్తున్నాడని, శుక్రవారం సాయంత్రం సమయంలో ప్రమాదవశాత్తు మురుగు కాలువలో పడి మృతి చెందాడని తెలిపారు. భార్య కోటవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

వీసా ఇప్పిస్తానని మోసం చేసిన వ్యక్తి అరెస్ట్

రాజంపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): విదేశాలకు వెళ్లడానికి వీసా ఇప్పిస్తానంటూ బాధితుల దగ్గర డబ్బులు తీసుకుని వారిని మోసం చేసి పరారైన గౌడ మల్లేశంను గురువారం పట్టుకుని అరెస్ట్‌చేసినట్లు ఎస్సై పుష్పరాజ్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గత సంవత్సరం మండలానికి చెందిన ముగ్గురి దగ్గర వీసా ఇప్పిస్తానంటూ ఒక్కొక్కరి దగ్గర 1లక్ష 20 వేలు డబ్బులు తీసుకుని వారిని మోసం చేయడంతో బాధితులు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో చీటింగ్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దోమకొండ మండలానికి చెందిన వ్యక్తిగా గుర్తించి పేరు మార్చుకుని కొత్తగుడెం పాల్వంచలో ఉన్నాడని సమాచారం రావడంతో అక్కడికి వెళ్లి అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను తక్షణమే ప్రారంభించాలి

● భారతీయ కిసాన్ సంఘ్ నాయకుల డిమాండ్


దోమకొండలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కిసాన్ సంఘ్ సభ్యులు


రామారెడ్డిలో వరి ధాన్యాన్ని పరిశీలిస్తున్న నేతలు, రైతులు

దోమకొండ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలని శుక్రవారం దోమకొండలో తహసీల్దార్ సంజయ్‌రావుకు భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు పైడి విఠల్‌రెడ్డి రైతులతో కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి కోతలు కోసి నెల రోజులు గడుస్తున్నా కాని ఎక్కడ కూడా కొనుగోలు ప్రారంభించలేదన్నారు. కొనుగోలు కేంద్రాల్లో వర్షానికి తడిసిన ధాన్యంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. షరతులు లేకుండా రైతులు పండించిన ప్రతి పంటకు క్వింటాలుకు రూ. 5 వందలు బోనస్ ఇవ్వాలన్నారు. వడ్ల బస్తా 40 కిలోల 650 గ్రామాలు మాత్రమే కాంట చేయాలని, కాంట అయిన వెంటనే రైతులకు తట్ పట్టి (లెక్క రశీదు)అందజేయాలన్నారు. కాంట అయిన 24 గంటల్లో రైతులకు వారి ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని, హమాలి డబ్బులు ప్రభుత్వమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఆనంద్‌రావు, మండలాధ్యక్షుడు కొండ శ్రీనివాస్, దోమకొండ పట్టణ అధ్యక్షుడు పెద్దిరెడ్డి నారాయణరెడ్డి, రైతులు కూర చంద్రం,అబ్రబోయిన రాజేందర్, పుర్ర బాపురెడ్డి, పుట్ట రమేష్, బాపురెడ్డి, పోగుల సిద్దిరాములు, రాజు రైతులు పాల్గొన్నారు.

సదాశివనగర్: వరి ధాన్యం వెంటనే కొనుగోలుచేయాలని భారతీయ కిసాన్‌సంఘ్ ఆధ్వర్యంలో రైతులు తహసీల్దార్ గంగాసాగర్‌కు శుక్రవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా భారతీయ కిసాన్ సంఘ్ మండల అధ్యక్షుడు కొప్పుల నర్సారెడ్డి,జిల్లా కార్యదర్శి శంకర్‌రావు మాట్లాడుతూ ప్రారంభించిన కొనుగోలు కేంద్రాలు కేవలం ఫోటోలకే పరిమితమయ్యాయని 20 రోజులుగా వరి ధాన్యం రాశులుగా పోసుకుని మబ్బులు వస్తే కప్పడం ఎండ వస్తే తిరిగడం తప్ప రైతులు ఏమి చేయని పరిస్థితుల్లో ఉన్నారన్నారు. ప్రభుత్వం వెంటనే వరి ధాన్యాన్ని తూకం వేసి ధాన్యాన్ని తరలించాలని తెలిపారు. 40 కిలోల తూకం వేసి బస్తాబరువు మాత్రమే తీసివేయాలని ఏ మాత్రం అదనంగా తూకం వేసిన రైతులు తిరగబడతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గసభ్యులు ఏనుగు లక్ష్మారెడ్డి, సాహెబ్, దొడ్లె రవి, రాజారెడ్డి పాల్గొన్నారు.

రాజంపేట: మండల కేంద్రంలోని వరి ధాన్యం త్వరగా కొనుగోలు చేయాలని శుక్రవారం భారతీయ కిసాన్‌సంఘ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ అనిల్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోజులు గడుస్తున్న కొనుగోలు కేంద్రాల్లో కాంటా పెట్టడం లేదని కల్లాల్లో వడ్లు పూర్తిగా ఎండాయని ప్రస్తుతం కురుస్తున్న వర్షానికి తడుస్తుండడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. త్వరిత గతిన కాంటాపెట్టి కొనుగోలు పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు విఠల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, ఉపాధ్యక్షులు సిద్దిరాములు, ప్రధానకార్యదర్శి రామచంద్రం,సాకలి రాములు, గంగారెడ్డి, రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

తాడ్వాయి: కాంగ్రెస్ ప్రభుత్వం వరి కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం మాట్లాడుతూ అన్ని వడ్లకు 500 బోనస్ ఇవ్వాలన్నారు. వడ్లు తూకం వేసిన అలాగే 24 గంటల లోపు రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని తెలిపారు. హమాలీల ఛార్జీలు రైతులకు పడకుండా ప్రభుత్వమే భరించాలని అన్నారు. వినతిపత్రం అందించిన వారిలో భారతీయ కిసాన్ సంఘ్ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, ఏలేటి మహిపాల్‌రెడ్డి, పూరింటి రాజయ్య పాల్గొన్నారు.

మాచారెడ్డి: వరి ధాన్యంను త్వరగా కొనుగోలు చేయాలని భారతీయ కిసాన్‌సంఘ్ మండలశాఖ ఆధ్వర్యంలో పాల్వంచ తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. వరి పంటను కోసి ధాన్యంను కొనుగోలు కేంద్రాల వద్దకు తరలిస్తున్న సందర్భంగా వర్షాలు పడుతుండడంతో ధాన్యం తడిసిపోయి రైతులు ఆవేదన చెందుతున్నారు. కొనుగోలు కేంద్రాలను వెంట నే కాంటపెట్టి కొనుగోలుచేసి ధాన్యంను తరలించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు సాయిరెడ్డి, మండల అధ్యక్షుడు తోట సాయిలు, ఉపాధ్యక్షులు సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.

రామారెడ్డి: వరి పంటను త్వరగా కొనుగోలు చేయాలని కోరుతూ శుక్రవారం రామారెడ్డి తహసీ ల్దార్ సువర్ణకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రామారెడ్డి మండలం భారతీయ కిసాన్ సంఘ్ అధ్యక్షుడు నారెడ్డి రాజిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర్ ఆధ్వర్యంలో గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల వద్దకు వెళ్లి అకాల వర్షాలకు వరి పంట నష్టపోయినా, గిట్టుబాటు ధర మాదరిగా కొనుగోలు చేయాలని కోరారు. త్వరలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని, ఉన్న కొనుగోలు కేంద్రాల్లో గిట్టుబాటు ధర వరి పంటను కొనుగోలు చేయాలన్నారు. అకాల వర్షంతో తడిసిన ధాన్యాన్ని కొనుగోలు సైతం చేస్తూ రైతులను ఆదుకోవాలని పేర్కొన్నారు. కష్టపడి సాగు చేస్తున్న వరి ధాన్యానికి బోనస్ కూడా ఇవ్వాలని తహసీల్దార్‌కు వి నతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో రైతులు రాజిరెడ్డి, నరేష్, కిరణ్ కుమార్‌రెడ్డి, సాయిలు, రాజయ్య, నరసింహులు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వరి పంట కొనుగోలుపై శ్రద్ధ చూపని కాంగ్రెస్ ప్రభుత్వం

రామారెడ్డి: రైతులు ఆరుగాలం పాటు శ్రమించి పండించిన వరి పంట కొనుగోలుపై కాంగ్రెస్ ప్రభుత్వం ఏ మాత్రం శ్రద్ధ చూపడం లేదని మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పడిగెల శ్రీనివాస్ గుప్త విమర్శించారు. రామారెడ్డి మండల కేంద్రంలో శుక్రవారం వరి ధాన్యాన్ని పరిశీలించి రైతులు ఎదుర్కొంటున్న అవస్థలను అడిగి తెలుసుకున్నారు. రైతులు శ్రమించి పండిస్తున్న పంటలకు గిట్టుబాటు ధరలు రైతు రుణమాఫీ గిట్టుబాటు ధరలు లేక అనే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీలను ఏ మాత్రం పట్టించుకోవడం లేదని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం ఇలానే వ్యవహరిస్తే రైతులు శ్రేయస్సు కోసం రాస్తారోకోలు, సీఎం దిష్టిబొమ్మలు దగ్ధం చేస్తామని విమర్శించారు. వ్యవసాయ శాఖ మంత్రి,ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు రైతులపై శ్రద్ద చూపి వెంటనే వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యాన్ని త్వరగా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కాంగ్రెస్ ప్రజాప్రతినిధులను, మంత్రులను, ఎమ్మెల్యేలను గ్రామంలో తిరిగేందుకు అడ్డుకుంటామని హెచ్చరించారు.

పేకాట స్థావరాలపై పోలీసుల దాడులు

బిచ్కుంద, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దతక్కడపల్లి, పెద్దదడ్గి,బిచ్కుంద మూడు గ్రామాల్లో పేకాట ఆడుతున్న స్థావరాలపై దాడులు నిర్వహించి 31 మంది పేకాట రాయుళ్లను అరెస్ట్ చేసినట్లు ఎస్సై మోహన్‌రెడ్డి తెలిపారు. దీపావళి పండుగ సందర్భంగా పేకాట ఆడుతున్న సమాచారం మేరకు దాడిచేసి వారి వద్ద నుంచి 18 సెల్‌ఫోన్‌లు, రూ.42890 స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేసినట్లు తెలిపారు.

నాగిరెడ్డిపేట: మండలంలోని బెజ్గం చెరువు తండా పరిధిలోని పాశంకుంట ఏరియాలో గురువారం రాత్రి పేకాట ఆడుతున్న స్థావరంపై దాడి చేసి 13 మంది పేకాటరాయుళ్ళను పట్టుకున్నట్లు స్థానిక ఎస్సై మల్లారెడ్డి తెలిపారు. దీపావళి సందర్భంగా పేకాట ఆడుతారనే దానిపై ప్రత్యేక దృష్టి సాధించామని, మండలంలోని పాశంకుంట ఏరియాలో పేకాట ఆడుతున్నట్లు పక్కా సమాచారం అందడంతో, పోలీసు సిబ్బందితో కలిసి దాడి చేసినట్లు ఎస్సై తెలిపారు. పేకాట ఆడుతున్న 13 మందిని పట్టుకున్నట్లు, వారి వద్ద నుంచి తొమ్మిది సెల్‌ఫోన్లు, ఐదు బైక్‌లు, తొమ్మిది వేల రూపాయల నగదును స్వాధీనపరుచుకున్నట్లు కేసు నమోదు చేసినట్లు ఎస్సై మల్లారెడ్డి తెలిపారు.

పెద్ద కొడప్‌గల్: మండలంలోని ఆయా గ్రామాల్లో పేకాట కేంద్రాలపై దాడులు చేసి 10 కేసులు నమోదు చేసినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. రెండు రోజులుగా మండలంలోని వడ్లం, కాస్లాబాద్, అంజనీ, విఠల్ వాడీ తాండా, పెద్ద కొడప్‌గల్ గ్రామాల్లో పేకాట కేంద్రాలపై దాడులు చేసి 63 మందిపై కేసు నమోదు చేసి రూ.1 లక్ష 32 వేలు స్వాదీనం చేసుకున్నామని తెలిపారు.

లింగంపేట: మండలంలోని బాణాపూర్‌లో పేకాట ఆడుతున్నారని పక్కా సమాచారం మేరకు పేకాట స్థావరంపై దాడి చేసి 8మంది పేకాట రాయుళ్లను, రూ.11850నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై అరుణ్‌కుమార్ తెలిపారు.

సర్వేకు సర్వం సిద్ధం

(5వ పేజీ తరువాయి)

అరిగేలా తిరిగినా అర్హులమైనప్పటికీ ఉచిత విద్యుత్, గ్యాస్ సబ్సిడీ అమలు కావడం లేదని వాపోతున్నారు. ప్రభుత్వం చేపడుతున్న సర్వేను తూతూమంత్రంగా చేపట్టడంతో పాటు ఆయా అధికారుల పర్యవేక్షణ లోపంతో డాటా ఎంట్రీ చేసే సమయంలో ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారని దీంతో తాము అనేక కష్టనష్టాలను ఎదుర్కోవాల్సి వస్తుందని ప్రజలు ఒకింత అసహనం వ్యక్తం చేస్తున్నారు. సర్వేను పూర్తిస్థాయిలో ముగించడంతో పాటు డాటా ఎంట్రీ చేసే వరకు ప్రతీ ఇన్‌చార్జ్ అధికారి శ్రద్ధ వహించేలా అధికారులు తగు చర్యలు తీసుకుంటేనే ప్రజల్లో నెలకొన్న ఆందోళనకు చెక్ పెట్టిన వారవుతారు.

ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌ను కలిసిన నేతలు


షబ్బీర్ అలీని కలిసిన నేతలు

రామారెడ్డి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో రాష్ట్ర సలహాదారు, మాజీ మంత్రి మహ్మద్ షబ్బీర్ అలీని గురువారం కాంగ్రెస్ నేతలు, నాయకులు కలిశారు. రామారెడ్డి మండలం పోసానిపేట్ గ్రామానికి చెందిన గ్రామ వీడీసీ ఆధ్వర్యంలో దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. గ్రామ అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో వీడీసీ అధ్యక్షులు చాకటి సాయిలు, గాండ్ల ప్రవీణ్, పోసానిపేట్ గ్రామ మాజీ సర్పంచ్ గీరెడ్డి మహేందర్‌రెడ్డి, శివాలయంచైర్మన్ బండి పోచయ్య, కాంగ్రెస్ మండల నాయకులు నారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పోతుల చిన్న, భాస్కర్‌రెడ్డి, బెస్త ఆనందం, బండి నరసింహులు పాల్గొన్నారు.

వ్యవసాయ శాఖ మంత్రిని కలిసిన ఎమ్మెల్యే


మంత్రి తుమ్మలను కలిసిన జుక్కల్ ఎమ్మెల్యే తోట

పెద్ద కొడప్‌గల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును శుక్రవారం జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తోట మంత్రి దృష్టికి పలు సమస్యలు తీసుకరాగా వాటి పట్ల సానుకూలంగా మంత్రి స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. నియోజక వర్గంలో సోయా, వరి కాంటాలు తొందరగా ప్రారంభించడంతో పాటు సోయా కొనుగోలు గతంలో ప్రభుత్వం 6 క్వింటాళ్లు కొనుగోలు చేస్తుండగా, దాని పరిమితి 8 క్వింటాళ్లకు పెంచాలని కోరినట్లు తెలిపారు. దీంతో పాటుగానే నియోజక వర్గంలో వరిధాన్యాన్ని నిలువ చేయడానికి రెండు 50 వేల మెట్రిక్ టన్నుల గిడ్డంగుల నిర్మాణం కోసం నిధులు ఇవ్వాలని మంత్రికి కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు. వీటితో పాటుగా వ్యవసాయానికి స్పింకర్లు. డ్రిప్ సబ్సిడిపై అందించాలని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు. వరిధాన్యం కొనుగోలు ప్రారంభం కాకపోవడంతో రైతులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఎమ్మెల్యే మంత్రి దృష్టికి తీసుకరాగా రెండు రోజుల్లో వరి ధాన్యం కొనుగోలు చేపట్టాలని మంత్రి అధికారులకు ఆదేశించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. దీంతో పాటుగానే ఇటీవల పిట్లం మార్కెట్ కమిటీ నూతన కార్యవర్గం నియామకం కావడంతో ప్రమాణ స్వీకార కార్యక్రమానికి రావాలని మంత్రిని కోరగా మంత్రి అంగీకరించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిట్లం మా ర్కెట్ కమిటీ చైర్మన్ చీకోటి మనోజ్ పాల్గొన్నారు.

ఇంటింటి సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

కామారెడ్డిటౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఇంటింటి సర్వే పకడ్బందిగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని అశోక్‌నగర్ కాలనీలో జరుగుతున్న ఇంటింటి సర్వేను ఆయన పరిశీలించారు. సర్వే ప్రతీ ఇంటిలో నిర్వహించాలని, కుటుంబలోని ప్రతీఒక్కరు సమా చారాన్ని సేకరించాలని తెలిపారు. ఆ ఇంటిలోని సమాచారాన్ని సేకరించిన అనంతరం స్టిక్కర్ అంటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డీఓ రంగనాథ్‌రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ, కౌన్సిలర్ నరేందర్ పాల్గొన్నారు.

దోమకొండలో..

దోమకొండ : మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సమగ్ర ఇంటింటా కుటుంబ సర్వే విధానంపై ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, ఆయాలు, సీఏలకు అవగాహన కల్పించి సర్వేను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి కుటుంబం యొక్క వివరాలను తప్పకుండా నమోదు చేయాలని, ఒక్క ఇంటిని కుడా వదలకూడదన్నారు. దోమకొండలో అన్ని వార్డుల్లో శుక్రవారం సర్వే ప్రారంభించడం జరిగిందని ఎంపీడీవో తెలిపారు. కార్యక్రమంలో మాజీ పట్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, కార్యదర్శి దయాకర్‌రెడ్డి, బిల్ కలెక్టర్ కిషన్, ఏపీఎం రాజు, సీసీలు, తదితరులు పాల్గొన్నారు.

బీబీపేటలో ..

మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సమగ్ర ఇంటింటా కుటుంబ సర్వే 3వరకు ఉంటుందని బీబీపేట ఎంపీడీవో పూర్ణచంద్రోదయ కుమార్ తెలిపారు. ఆయన శుక్రవారం సర్వే స్టిక్కర్ చేసే విధ్యానాన్ని పరిశీలించారు. మండలంలో 57 ఎనిమినేటర్లు, ఆరుగురు సూపర్ వైజర్లు, మండల ప్రత్యేక అధికారి ఉన్నట్లు తెలిపారు.

ఉమ్మడి మద్నూర్ మండలంలో..

మద్నూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే ఉమ్మడి మద్నూర్ మండలంలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఉమ్మడి మద్నూర్ మండలంలోని ఆయా గ్రామాల్లో సిబ్బంది ఇళ్లను గుర్తించి స్టిక్కర్లు అతికిస్తున్నట్లు ఎంపీడీవో రాణి తెలిపారు. 135 మంది ఎన్యూమరేటర్లను నియమించినట్లు వెల్లడించారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

శాంతి	- లక్కీ భాస్కర్
దర్శన్	- సింగం అగేన్
ప్రియా 35	- అమరన్
ప్రియా 70	- లగ్గం

బాన్సువాడ

మహేశ్వరి	- వేట్టయన్ (ది హంటర్)
వెంకటేశ్వర	- అమరన్

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	160	200	220
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

